TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 52 ఆదివారం 27-09-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వెల:2.00/-

## జీవో118 బాధితులకు సర్కార్ ధోకా

-క్రమబద్ధీకరిస్తామన్న మంత్రి పొంగులేటి మాటలు డొల్ల
-మోసపోయిన సాయిప్రియ, సత్యనారాయణపురం వాసులు
-జాబితాలో తమ పేర్లు లేవంటూ చెప్పిన అధికారులు
-దికుతోచని స్థితిలో వందలాది బాధిత కుటుంబాలు




సిటీబ్యూరో, సెప్టెంబర్ 26
ఇండ్లు లేని పేదలకు, ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల తరబడి నివాసముంటున్న ప్రతి ఒకరికీ ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించి అండగా నిలుస్తాం.. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒకరికీ న్యాయం చేస్తాం..అని అధికారంలోకి రాకముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... ఇప్పుడు బాధితులకు ధోకా చేస్తోంది. మంత్రులు, కాంగ్రెస్ పెద్దలు చేసిన హామీలు నీటిమూటలుగానే మారుస్తున్నారు. మేడ్చల్ మలాజి గిరి జిల్లాలోని కొన్ని కాలనీల బాధితుల కన్నీటి గాథలకు పరిష్కారం చూపుతామంటూ చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. విధానపరమైన నిర్ణయాల పేరిట పెడుతున్న మెలికలు.. జీవో నం. 118 బాధితులకు శాపంగా మారుతున్నాయి.

## భయపెడుతున్న సూపర్ ఎల్ నినో

20 ఏళ్ల తర్వాత పెరగాల్సిన ఉష్ణోగ్రతలు ఆరు నెలల్లో హైక్

- సాధారణం కంటే 1.2 డిగ్రీల మేర అధిక వేడి
- చలికాలంలోనూ వడగాలుల ముప్పు తప్పదని హెచ్చరిక
- ప్రపంచవ్యాప్తంగా భారీగా పెరగనున్న వేడి మరణాలు
- భారత్‌లోనూ వేలాది అదనపు మరణాల అంచనా
- ఉష్ణోగ్రతలు, మరణాల సంబంధంపై శాస్త్రీయ విశ్లేషణ
- 1996--2025 కాలాన్ని ప్రామాణికంగా తీసుకున్న పరిశోధకులు
- ముందస్తు చర్యలతో ముప్పును తగ్గించుకోవచ్చని నిపుణుల సూచన

02

'సూపర్ ఎల్‌నినో' ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ అంచనా ప్రకారం.. సెప్టెంబర్ 2026 నుంచి ఫిబ్రవరి 2027 మధ్య ప్రపంచవ్యాప్తంగా సుమారు 4.51 లక్షల అదనపు వేడి సంబంధిత మరణాలు సంభవించే అవకాశం ఉంది. భారత్‌లోనూ దాదాపు 15,800 అదనపు మరణాలు నమోదయ్యే అవకాశముందని నివేదిక పేర్కొంది. రాబోయే నెలల్లో భూఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.2 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండొచ్చని, అత్యంత వేడి రోజులు 44 శాతం పెరగవచ్చని అంచనా వేసింది. ఈ మరణాల అంచనాలను కాలానుగుణ ఉష్ణోగ్రతల అంచనాలు, ఉష్ణోగ్రత--మరణాల మధ్య సంబంధాల ఆధారంగా రూపొందించినట్లు అధ్యయన సహ రచయిత ఎమిలీ గ్రోవర్-కోపెక్ తెలిపారు.






## తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల

- 70.07 శాతం ఉత్తీర్ణత
- టీజీటెట్ ఇన్-సర్వీస్-2026 ఫలితాలు విడుదల
- 22,477 మందిలో 15,749 మంది అర్హత
- పేపర్-1లో 68.76 శాతం మంది పాస్
- గణితం, సైన్స్‌లో 73.60 శాతం ఉత్తీర్ణత
- సోషల్ స్టడీస్‌లో 67 శాతం మంది అర్హత

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన టీజీటెట్-ఇన్-సర్వీస్ టీచర్స్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, టీజీటెట్ చైర్‌పర్సన్ శనివారం ఫలితాలను విడుదల చేశారు. జూలై 21న విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 8, 9 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించారు. మూడు విడతల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరిగాయి. మొత్తం 24,986 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 22,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,749 మంది అర్హత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 70.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పేపర్-1లో 4,942 మంది పరీక్షకు హాజరుకాగా.. 3,398 మంది (68.76%) అర్హత సాధించారు. పేపర్-2 గణితం, -మిగతా 2 లో

## మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న

# ఇవ్వాలి

ఢిల్లీలో ఆయన జ్ఞాపకార్థం విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి

- ఆర్థిక సంస్కరణలతో దేశానికి కొత్త దిశ చూపిన మన్మోహన్‌సింగ్
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష నెరవేర్చడంలో కీలక పాత్ర
- హెచ్‌ఎండీఏ నిర్మించిన స్మారక పార్క్‌ను ప్రారంభించిన సీఎం
- మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్‌రెడ్డి
- ప్రజల హక్కులకు చట్టబద్ధత కల్పించిన పలు కీలక చట్టాలు
- తెలంగాణ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై ఆయన సంతకాన్ని స్మారకంగా ఏర్పాటు
- రాజకీయాలకు అతీతంగా మహనీయుల సేవలను గుర్తించాలన్న సీఎం
- భారతరత్న, ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీలకు సూచన

డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలను గుర్తించి ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఏర్పాటు బిల్లుపై సంతకం చేసి రాష్ట్ర ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ జ్ఞాపకార్థం ఢిల్లీలో సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో హెచ్‌ఎండీఏ నిర్మించిన మన్మోహన్‌సింగ్ స్మారక పార్క్, విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక సరళీకరణలో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్‌సింగ్ పాత్రను రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.

02







02

## నేపాల్ వరదల్లో 5 వేల మంది గల్లంతు

- ఆకస్మిక వరదలకు నెల రోజులు..
- 1,453 మంది మృతి, 13,795 మందిని రక్షించిన అధికారులు
- మధ్య, ఉత్తర నేపాల్‌లో ఆకస్మిక వరదలతో భారీ ప్రాణనష్టం
- చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందినట్లు ప్రకటన
- 5,285 మంది గల్లంతైనట్లు అధికారుల వెల్లడి
- ఇప్పటివరకు 13,795 మందిని సురక్షితంగా రక్షించిన బృందాలు
- వరద బాధితుల్లో 11 వేల మందికి వైద్య సవలు అందించిన భద్రతా సంస్థలు
- టిబెట్‌లో 43 మంది మృతి.. 500 మందికిపైగా గల్లంతైనట్లు చైనా మీడియా కథనం



02

## వెనుదిరిగిన 'నైరుతి'

- తెలంగాణలో 15 శాతం లోటుతో ముగిసిన నైరుతి
- చివరి నాలుగు రోజుల వర్షాలతో భారీగా తగ్గిన లోటు
- శనివారం నుంచి రాష్ట్రంలో పెరగనున్న ఉక్కపోత
- భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద
- భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



## పాక్‌లో మరోసారి ఆత్మాహుతి దాడి

- డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో శనివారం భారీ పేలుడు
- పోలీస్ చెక్‌పోస్టు వద్దకు పేలుడు పదార్థాలతో వాహనం తీసుకొచ్చిన ఉగ్రవాది
- వాహనంతో పాటు తనను తాను పేల్చుకున్న ఆత్మాహుతి దళ సభ్యుడు
- పేలుడు ధాటికి 11 మంది మృతి.. మరో 30 మందికి గాయాలు
- క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించిన పోలీసులు
- గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడి
- దాడికి తామే బాధ్యులమని ప్రకటించిన టీటీపీ
- పేలుడు ధాటికి పరిసర ప్రాంతాల్లో భారీగా నష్టం.. ఘటనపై దర్యాప్తు

02



ప్రశాంతంగా ముగిసిన

## నిమజ్జనం

- పోలీసుల వ్యూహం.. శాఖల సమన్వయంతో హైదరాబాద్‌లో ఘనంగా గణేశ్ ఉత్సవాల ముగింపు
- సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా
- ట్రాఫిక్ మళ్లింపులతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- హుస్సేన్‌సాగర్, చెరువులు, కృత్రిమ కొలనుల్లో విగ్రహాల నిమజ్జనం
- జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 287 భారీ క్రేన్ల ఏర్పాటు
- 30 వేల మంది పోలీసులతో భద్రత.. 770 మంది పారిశుధ్య సిబ్బంది సేవలు
- ఖైరతాబాద్ గణపతిని 30 లక్షలు.. బాలాపూర్ గణనాథుడిని 15 లక్షల మంది దర్శనం
- 51,207 మండపాలకు ఉచిత విద్యుత్.. రూ.17.80 కోట్ల వ్యయాన్ని భరించిన ప్రభుత్వం

సిటీబ్యూరో
హైదరాబాద్ మహానగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. గత 11 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. గణపతుల నిమజ్జనం చివరి రోజు శుక్రవారమే అయినప్పటికీ రాత్రి బయలుదేరిన విగ్రహాలు శనివారం మధ్యాహ్నం వరకు నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తిచేసుకున్నాయి. వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకలు అత్యంత ప్రశాంత, శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ముగిశాయి. నగరం నలుమూలల్లోని పలు ప్రాంతాల నుంచి బయలుదేరిన వినాయక విగ్రహాలను తీసుకొని భక్తులు హుస్సేన్ సాగర్(ట్యాంక్ బండ్), సరోర్‌నగర్ చెరువు, కాప్రా చెరువు, దుర్గం చెరువు, మల్కం చెరువు, ఐడిఎల్ చెరువులతోపాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కృత్రిమ నిమజ్జన కొలనులకు -మిగతా 2 లో

ఎక్కడ పోయినా 'దేఖ్ లేంగే'

# అంటున్రు

ఎక్కడికి వెళ్లినా కేసీఆర్ పేరే వినిపిస్తోంది



- ప్రజల గుండెల్లో కేసీఆర్ భద్రంగా ఉన్నారు
- 46 లక్షల మంది పింఛన్‌దారుల ఆశీర్వాదం కేసీఆర్‌కే
- రూ.200 పింఛన్‌ను రూ.2 వేలకు పెంచారు
- ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే
- మిషన్ భగీరథ నీటి బొట్టులో కేసీఆర్ కనిపిస్తున్నారు
- కల్యాణలక్ష్మితో తల్లిదండ్రులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నారు
- కాళేశ్వరం ద్వారా రైతులకు గోదావరి నీళ్లు అందించారు
- రైతుబంధు సకాలంలో ఇచ్చారు.. ఇప్పుడు పరిస్థితి మారింది
- కేసీఆర్‌ను తిట్టడం తప్ప రేవంత్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

హైదరాబాద్
గణేశుల పండుగొచ్చింది.. ఏమైంది.. ఊరూరుకి ఏం నడుస్తుంది.. ఎక్కడ పోయినా ఏ పేరు వినబడుతోంది. దేఖ్ లేంగే అంటున్రు.. కేసీఆర్ అంటున్నరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో వారికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి -మిగతా 2 లో



02

## ఏఐతో పెను ముప్పు

- తప్పుడు చేతుల్లో పడితే 100 కోట్ల మంది ప్రాణాలకు ముప్పు..
- ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తత అవసరమన్న బిల్ గేట్స్
- దురుద్దేశపూరిత వినియోగంతో భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదమని హెచ్చరిక
- భూమిపై ఉపయోగించిన ఆయుధాలన్నింటికంటే ఏఐ ప్రమాదకరంగా మారొచ్చన్న వ్యాఖ్య
- ఏఐ ముప్పును తీవ్రంగా పరిగణించాలని సూచన
- ఏఐపై చట్టాలు తీసుకురావాలని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి
- కంపెనీల నియంత్రణతోపాటు ప్రభుత్వ పర్యవేక్షణ అవసరమన్న అభిప్రాయం
- ఆస్ట్రేలియా ప్రభుత్వ ఆరోగ్య సమాచార వ్యవస్థలోకి ఏఐ మోడల్ చొరబాటు
- ఘటనపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని అల్బనీస్.. నియంత్రణ తప్పనిసరన్న ఆల్ట్‌మన్

# వెనుదిరిగిన 'నైరుతి'

**తెలంగాణలో 15 శాతం లోటుతో ముగిసిన నైరుతి**
**- చివరి నాలుగు రోజుల వర్షాలతో భారీగా తగ్గిన లోటు**
**- శనివారం నుంచి రాష్ట్రంలో పెరగనున్న ఉక్కపోత**
**-భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద**
**- భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి : తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసింది. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు నిరాశే మిగిల్చినా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం చివరి రోజుల్లో ఆదుకుంది. గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన విస్తారమైన వర్షాల కారణంగా వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. సీజన్ మొత్తం మీద 20 శాతంగా ఉన్న లోటు, ఈ వర్షాలతో 15 శాతానికి పరిమితమైంది. సెప్టెంబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అయితే గత నాలుగు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ నెల లోటు కేవలం 4 శాతానికి పడిపోయింది. ఈ కొద్దిరోజుల్లోనే సగటున 52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం విశేషం. ఈ వర్షాలకు ముందు 18 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 14కు తగ్గింది. అయితే, ఏ జిల్లాలోనూ అధిక వర్షపాతం నమోదు కాలేదు.

మరోవైపు, భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి 20.2 అడుగులకు చేరిన ప్రవాహం, నేడు శనివారం నాటికి 30 అడుగులకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో వర్షపు నీరు గనుల్లోకి చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది.

వాయుగుండం ప్రభావం ముగియడంతో శనివారం నుంచి రాష్ట్రంలో ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. రేపటి (ఆదివారం) నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు

## నేపాల్ వరదల్లో 5 వేల మంది గల్లంతు

**-ఆకస్మిక వరదలకు నెల రోజులు..**
**-1,453 మంది మృతి, 13,795 మందిని రక్షించిన అధికారులు**
**-మధ్య, ఉత్తర నేపాల్‌లో ఆకస్మిక వరదలతో భారీ ప్రాణనష్టం**
**-చికిత్స పొందుతూ మరో ఇద్దరు మృతి చెందినట్లు ప్రకటన**
**-5,285 మంది గల్లంతైనట్లు అధికారుల వెల్లడి**
**-ఇప్పటివరకు 13,795 మందిని సురక్షితంగా రక్షించిన బృందాలు**
**-వరద బాధితుల్లో 11 వేల మందికి వైద్య సేవలు అందించిన భద్రతా సంస్థలు**
**-టిబెట్‌లో 43 మంది మృతి.. 500 మందికిపైగా గల్లంతైనట్లు చైనా మీడియా కథనం**



ఖాట్మండు, సెప్టెంబర్ 26: నేపాల్ మధ్య, ఉత్తర జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించిన నెల రోజుల తర్వాత నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) తెలిపిన వివరాల ప్రకారం కనీసం 1,453 మంది మరణించారు. 5,285 మంది ఆచూకీ తెలియకుండా పోయారు. ఇప్పటివరకు 1,451 మంది మృతదేహాలను వెలికితీశామని, చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారని అథారిటీ తెలిపింది. ఇప్పటివరకు మొత్తం 13,795 మందిని రక్షించినట్లు శనివారం అథారిటీ పేర్కొంది. చైనా మీడియా కథనం ప్రకారం ఈ విపత్తు కారణంగా టిబెట్‌లో 43 మంది మరణించగా 500 మందికి పైగా ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వరదల బారిన పడ్డ 11,000 మందికి భద్రతా సంస్థలు ఇప్పటివరకు వైద్య చికిత్స అందించాయి.

## తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల

(మొదటి తరువాయి)

సైన్స్ విభాగంలో 9,131 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,720 మంది (73.60%) ఉత్తీర్ణులయ్యారు. పేపర్-2 సోషల్ స్టడీస్‌లో 8,404 మంది పరీక్షకు హాజరుకాగా.. 5,631 మంది (67%) అర్హత సాధించారు. అభ్యర్థులు తమ ఫలితాలతో పాటు మార్కుల వివరాలను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమీపంలోని మీ-సేవ కేంద్రాల్లోనూ మార్కుల వివరాలను పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## పాక్‌లో మరోసారి ఆత్మాహుతి దాడి



న్యూఢిల్లీ
వరుస దాడులతో ఇబ్బంది పడుతున్న పాకిస్తాన్‌లో మరోసారి దాడి జరిగింది. శనివారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 11 మంది మరణించగా, 30 మంది గాయపడ్డారు. ఈ ఘటన పాక్, ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్‌లోని, డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలో శనివారం జరిగింది. ఈ దాడికి పాల్పడింది తామే అని టీటీపీ (తెహ్రీక్ ఈ తాలిబన్ పాకిస్తాన్) అనే ఉగ్ర సంస్థ ప్రకటించుకుంది. పాక్ పోలీసులు వెల్లడించిన వివరాలివి. ఆత్మాహుతి పాల్పడేందుకు సిద్ధమైన ఒక ఉగ్రవాది భారీ పేలుడు పదార్థాలున్న వాహనంతో రోడ్డు పక్కన ఉన్న ఒక పోలీస్ చెక్‌పోస్టు వద్దకు దూసుకొచ్చాడు. అనంతరం తనను తాను పేల్చుకున్నాడు. ఇదే సమయంలో వాహనంలో ఉన్న పేలుడు పదార్థాలు కూడా ఒక్కసారిగా పేలిపోయాయి. దీంతో భారీ పేలుడు సంభవించి 11 మంది మరణించగా.. మరో 30 మంది వరకు గాయపడ్డారు. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ దాడికి సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. పేలుడు ధాటికి భారీగా పొగ వెలువడటం, చుట్టుపక్కల ప్రదేశాలు భారీగా ధ్వంసం కావడం వీడియోల్లో కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసగా పాకిస్తాన్‌లో పేలుళ్లు, ఆత్మాహుతి దాడులు జరుగుతున్నాయి.

## ఏఐతో పెను ముప్పు

వాషింగ్టన్, సెప్టెంబర్ 26: ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) వాడకం విస్తృతమవుతున్న క్రమంలో దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేర్కొన్నారు. ఏఐ కనుక తప్పుడు వ్యక్తుల చేతుల్లో పడితే దాని పరిణామాలు ఎంత తీవ్రంగా మారవచ్చంటే, అది 100 కోట్ల ప్రజల మరణాలకు కూడా దారితీయవచ్చునని ఆయన హెచ్చరించారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఏఐ టూల్స్‌ను ప్రజలు దురుద్దేశాలకు వినియోగిస్తే అది ఇప్పటివరకు భూమిపై ఉపయోగించిన అన్ని ఆయుధాల కన్నా అత్యంత ప్రమాదకారిగా మారుతుందన్నారు. దాని వల్ల వచ్చే ముప్పును తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ఏఐపై చట్టం చేయాలని ఆయన అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. కేవలం కంపెనీల నియంత్రణ ఒక్కటే సరిపోదని, దానిపై ప్రభుత్వ పర్యవేక్షణ, నిబంధనలు తప్పనిసరని అభిప్రాయపడ్డారు. కాగా, ఒక ఏఐ మోడల్ తొలిసారిగా ఒక ప్రభుత్వ పోర్టల్‌ను హ్యాక్ చేసినట్టు సమాచారం. ఈ ఘటన ఆస్ట్రేలియాలో చోటుచేసుకుంది. ఓపెన్ ఏఐ అభివృద్ధి చేసిన ఈ మోడల్ దేశ ఆరోగ్య సమాచార వ్యవస్థలోకి చొరబడి దేశంలోని పౌరుల ఆరోగ్య డాటా, ప్రభుత్వం ఆరోగ్య రంగంపై అందజేస్తున్న సబ్సిడీ తదితర వివరాలను సేకరించింది. కాగా ఈ విషయాన్ని ఓపెన్ ఏఐ ప్రభుత్వానికి 54 రోజుల తర్వాత తెలిపింది. దీంతో ఓపెన్ ఏఐ చీఫ్ శామ్ ఆల్ట్‌మన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఏఐపై నియంత్రణ తప్పనిసరని ఈ సందర్భంగా ఆల్ట్‌మన్ ఆయనతో పేర్కొన్నారు.

# భయపెడుతున్న సూపర్ ఎల్ నినో

**- 20 ఏళ్ల తర్వాత పెరగాల్సిన ఉష్ణోగ్రతలు ఆరు నెలల్లో హైక్**
**-సాధారణం కంటే 1.2 డిగ్రీల మేర అధిక వేడి**
**-చలికాలంలోనూ వడగాలుల ముప్పు తప్పదని హెచ్చరిక**
**-ప్రపంచవ్యాప్తంగా భారీగా పెరగనున్న వేడి మరణాలు**
**-భారత్‌లోనూ వేలాది అదనపు మరణాల అంచనా**
**-ఉష్ణోగ్రతలు, మరణాల సంబంధంపై శాస్త్రీయ విశ్లేషణ**
**-1996--2025 కాలాన్ని ప్రామాణికంగా తీసుకున్న పరిశోధకులు**
**-ముందస్తు చర్యలతో ముప్పును తగ్గించుకోవచ్చని నిపుణుల సూచన**



న్యూఢిల్లీ
ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు తీవ్రరూపం దాల్చుతున్న వేళ మానవాళిని మరో ముప్పు కమ్ముకోనుంది. రానున్న ఆరు నెలల్లో సంభవించనున్న 'సూపర్ ఎల్ నినో' ప్రభావం వల్ల భారత్ తో పాటు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ (ఈపీఐసీ) తన తాజా నివేదికలో హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా 4,51,000 లక్షలు, భారత్ లో 15,800 అదనపు మరణాలు సంభవిస్తాయని ఈ నివేదిక అంచనా వేసింది. గ్లోబల్ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఈ నివేదిక శాస్త్రీయ పద్ధతులు, విశ్లేషణ విధానాలను ఈ పరిశోధనలో భాగమైన ఎమిలీ గ్రోవర్ కోపెక్ వివరించారు. ఈ 'ఎల్ నినో' వల్ల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఏకంగా 1.2 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా పెరిగే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ చికాగో నివేదిక చెబుతోంది. రానున్న రెండు దశాబ్దాల్లో సాధారణ వాతావరణ మార్పుల కారణంగా సంభవించాల్సిన అత్యధిక ఉష్ణోగ్రతలు, ఈ ఒక్క 'సూపర్ ఎల్ నినో' వల్ల మనం ఇప్పుడే చూడాల్సి వస్తుందని నివేదిక చెబుతోంది. శీతాకాలం, వేసవి అనే తేడా లేకుండా రానున్న కాలంలో తీవ్ర వడగాలులు ప్రజలను హడలెత్తిస్తున్నాయి.

మరణాల అంచనాకు రెండు ప్రాతిపదికలు

ఈ నివేదికలో పేర్కొన్న మరణాల గణాంకాలు వట్టి మాటలు కాదని, దీని వెనుక పక్కా శాస్త్రీయ విశ్లేషణ, పరిశోధనా పద్ధతులు ఉన్నాయని గ్రోవర్ కోపెక్ స్పష్టం చేశారు. ఈ అంచనాకు ప్రధానంగా రెండు ప్రాతిపదికలు తీసుకున్నట్లు వివరించారు. అందులో ఒకటి కాలానుగుణ ఉష్ణోగ్రత అంచనాలు, రెండోది ఉష్ణోగ్రతలకు, మరణాలకు మధ్య ఉన్న సంబంధం ఆధారంగా ఈ నివేదికను తయారు చేసినట్లు చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయమైన యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్కాస్ట్స్ వ్యవస్థ నుంచి ఉష్ణోగ్రత అంచనాలను సేకరించినట్లు గ్రోవర్ కోపెక్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న పలు రకాల వాతావరణ సూచనలతో పోల్చే, ఈ వ్యవస్థ చూపించే అంచనాలు వాస్తవిక దృక్పథంతో ఉంటాయని చెప్పారు. కేవలం ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, మానవ ఆరోగ్యంపై అవి ఏ విధంగా ప్రభావం చూపుతాయనే దానిపై గతంలో లోతైన పరిశోధన జరిగింది. నవంబర్ 2022లో ప్రఖ్యాత 'క్వార్టర్లీ జర్నల్ ఆఫ్ ఎకనామిక్స్' పత్రికలో ప్రచురితమైన పరిశోధనా సూత్రాన్ని ఇక్కడ ప్రాతిపదికగా తీసుకున్నట్లు వెల్లడించారు. గతంలో సుదూర భవిష్యత్తు కోసం వాతావరణ నమూనాలను అంచనా వేయడానికి వాడిన ఈ ఫార్ములానే ఇప్పుడు తాము కూడా ఉపయోగించామని పేర్కొన్నారు.

1996-2025 కాలపరిమితిని ఎంచుకోవడానికి కారణాలు

ఈ అధ్యయనం కోసం 1996 నుంచి 2025 వరకు గల నిర్దిష్ట ఉష్ణోగ్రతల కాలపరిమితిని పరిశోధకులు ఎంచుకున్నారు. అయితే, ఆ కాలపరిమితిని ఎందుకు ఎంచుకున్నారనే ప్రశ్నకు గ్రోవర్ కోపెక్ స్పందించారు. ప్రభుత్వాలు ప్రస్తుతం అమలు చేస్తున్న ప్రణాళికలకు ఈ గణాంకాలు నేరుగా ఉపయోగపడాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో వనరులను కేటాయించడానికి, ముందస్తు చర్యలు తీసుకుని ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రస్తుత వాస్తవ పరిస్థితులతో కూడిన సమాచారం అత్యంత అవసరమని చెప్పారు. 30 సంవత్సరాల కాలాన్ని బేస్ లైన్ గా తీసుకోవడం అంతర్జాతీయంగా ప్రామాణికమని, అందుకే తాజా మూడు దశాబ్దాల కాలాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

ఈ నివేదికపై నిపుణులు ఏం అన్నారంటే

ఈ అధ్యయనం ముందస్తు హెచ్చరిక లాంటిదని నేచురల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి అభియాంత్ తివారీ కొనియాడారు. అయితే, ఇది అంచనా మాత్రమేనని, దీని పూర్తి విధివిధానాలు, విస్తృతమైన సమీక్షను పూర్తి చేసుకోవాల్సి ఉందని తెలిపారు. అయినప్పటికీ, దేశంలో ఇప్పటికే అమలులో ఉన్న 'హీట్ యాక్షన్ ప్లాన్స్' అనుభవం ద్వారా ప్రభుత్వాలు మరింత పకడ్బందీగా సన్నద్ధమవ్వడానికి ఇది ఒక గొప్ప అవకాశమన్నారు. దక్షిణాసియా ప్రాంతం ఈ ఉష్ణోగ్రతల తీవ్రతను అత్యధికంగా ఎదుర్కొనే ప్రమాదముందని ఎయిమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ హర్షల్ రమేష్ సాల్వే హెచ్చరించారు. వేడిమి వల్ల కలిగే అనారోగ్యాలు, మరణాల గురించి మనకు ఇప్పటికే స్పష్టమైన అవగాహన ఉందని, ఈ నివేదిక దానిని మరింత బలోపేతం చేసిందన్నారు. ఈ ముప్పు నుంచి బయటపడాలంటే కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా, డేటా ఆధారిత విధాన రూపకల్పన అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. జాతీయ, స్థానిక స్థాయిలో బలమైన మౌలిక వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తున్నారు. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, గర్భిణులు, చిన్నారులు, బహిరంగ ప్రదేశాలలో పనిచేసే శ్రామికులు, కూలీలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వాలు ఇప్పటి నుంచే సమన్వయంతో కూడిన 'ఈక్విటీ-డ్రైవెన్' విధానాలను అమలు చేస్తే భవిష్యత్తులో వచ్చే సూపర్ ఎల్ నినో నుంచి వేలాది ప్రజానీకాన్ని ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

ఆర్థిక సంస్కరణలతో దేశానికి కొత్త దిశ చూపిన మన్మోహన్‌సింగ్
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష నెరవేర్చడంలో కీలక పాత్ర
హెచ్ఎండీఏ నిర్మించిన స్మారక పార్క్‌ను ప్రారంభించిన సీఎం
మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన రేవంత్‌రెడ్డి
ప్రజల హక్కులకు చట్టబద్ధత కల్పించిన పలు కీలక చట్టాలు
తెలంగాణ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై ఆయన సంతకాన్ని స్మారకంగా ఏర్పాటు
రాజకీయాలకు అతీతంగా మహనీయుల సేవలను గుర్తించాలన్న సీఎం
భారతరత్న, ఢిల్లీలో విజ్ఞాన కేంద్రం కోసం పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీలకు సూచన



హైదరాబాద్:
భారతదేశ గొప్ప రాజనీతిజ్ఞుడు, ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న పురస్కారం అందించి గౌరవించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపడంతో పాటు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నెరవేర్చడంలో కీలక పాత్ర పోషించిన మన్మోహన్‌సింగ్ సేవలను దేశం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన జ్ఞాపకార్థం దేశ రాజధాని ఢిల్లీలో సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ స్మారక పార్క్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, నవీన్ యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి డాక్టర్ మన్మోహన్‌సింగ్ అందించిన విశేషమైన సేవలను గుర్తుచేశారు. దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను ప్రవేశపెట్టారని తెలిపారు. విదేశీ మారక నిల్వలు తీవ్రంగా క్షీణించిన సమయంలో తన అనుభవాన్ని ఉపయోగించి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆయన కీలక చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆర్థిక సలహాదారుగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ అనేక బాధ్యతలు నిర్వహించారని సీఎం తెలిపారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత హక్కు చట్టం, ఆదివాసీల హక్కులకు సంబంధించిన చట్టం, భూసేకరణ--పునరావాస చట్టం వంటి కీలక చట్టాలు అమల్లోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రజల హక్కులకు చట్టబద్ధత కల్పించడంలో ఇవి ముఖ్యమైన అడుగులుగా నిలిచాయని అన్నారు. దేశం గర్వించదగిన జాతిరత్నమైన మన్మోహన్‌సింగ్ జీవితం, సేవలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలనే ఉద్దేశంతోనే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశం కోసం పనిచేసిన మహనీయుల సేవలను రాజకీయాలకు అతీతంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. జెన్-జీ, ఆల్ఫా, బీటా తరాలకు మన్మోహన్‌సింగ్ దేశభక్తి, సేవా స్ఫూర్తిని అందించాలనే ఉద్దేశంతో స్మారక పార్క్‌ను నిర్మించామని చెప్పారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐఎస్‌బీ, అమెరికన్ కాన్సులేట్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయని సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన బలాన్ని చేకూరుస్తున్న సంస్థలు ఉన్న ఈ ప్రాంతంలో ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన మన్మోహన్‌సింగ్ విగ్రహాన్ని, స్మారక పార్క్‌ను ఏర్పాటు చేయడం సముచితమని ప్రభుత్వం భావించిందన్నారు. తెలంగాణ చరిత్రను రెండు ప్రధాన ఘట్టాలుగా చూడవచ్చని రేవంత్‌రెడ్డి అన్నారు. నిజాం పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి లభించడం ఒక ఘట్టమైతే.. సమైక్య రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ ఏర్పడటం మరో కీలక ఘట్టమన్నారు. హైదరాబాద్ రాష్ట్ర విముక్తి సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నాయకత్వాన్ని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 60 ఏళ్లపాటు సాగిన సుదీర్ఘ పోరాటానికి ముగింపు పలికి ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేయడంలో సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్ కీలక పాత్ర పోషించారని సీఎం పేర్కొన్నారు. ఎంతో మంది త్యాగాలు, ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు బిల్లుపై మన్మోహన్‌సింగ్ చేసిన సంతకాన్ని స్మారక పార్క్‌లో ప్రత్యేకంగా నిక్షిప్తం చేశామని చెప్పారు. పార్క్‌ను సందర్శించే ప్రతి ఒక్కరికీ ఆయన సంతకం కనిపించేలా ఏర్పాటు చేశామని తెలిపారు. మన్మోహన్‌సింగ్‌తో వ్యక్తిగత పరిచయం, ఆయన ఆలోచనలపై అవగాహన ఉన్న మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామిని ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించామని సీఎం చెప్పారు. మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో ఆయనతో మాట్లాడించామని తెలిపారు. దేశ శ్రేయస్సు కోసం ఎన్నో కీలక చట్టాలు, విధానాలను అమలు చేసిన మన్మోహన్‌సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడని రేవంత్‌రెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండకూడదని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా దేశానికి సేవ చేసిన మహనీయులను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా తీసుకెళ్లేందుకు పునాది వేసిన వ్యక్తుల్లో మన్మోహన్‌సింగ్ ఒకరని సీఎం అన్నారు. దేశ ఆర్థిక ప్రగతికి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ భారతరత్న పురస్కారం అందించాలని కోరారు. ఆయన జ్ఞాపకార్థం ఢిల్లీలో విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలను తెలంగాణ ఎంపీలు పార్లమెంట్‌లో లేవనెత్తాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## ఎక్కడ పోయినా 'దేఖ్ లేంగే' అంటుర్రు

(మొదటి తరువాయి)

ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మూడేళ్లు పెద్ద మనిసి కనబడకపోయినా.. కేసీఆర్ బయటకు రా అని కాంగ్రెసోళ్లు అడుగుతా ఉంటరు కదా.. కేసీఆర్ ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నడు అనే మాట. మా పిల్లలే చెప్పారు. ఇవాళ రూ.2 వేలు పెన్షన్ అందుకుంటున్న 46 లక్షల మంది మా తల్లులు, మా పెద్ద మనుషులు కేసీఆర్‌కు రోజూ దీవెన పెడుతున్నరు. 200 రూపాయలుండే కొడుకా కేసీఆర్ రూ.2 వేలు చేసిండు. వీళ్లన్నీ లంగమాటలు చెప్పిర్రు.. ఏం చేయలేదు. ఇవాళ పాత రూ.2 వేలే వస్తున్నయని ప్రతీ తల్లి, పెద్ద మనిషి కేసీఆర్‌ను ఆశీర్వదిస్తున్నరు. అదేవిధంగా కేసీఆర్ ఇంటింటికీ నల్లా పెట్టి నీళ్లిచ్చిండు. ఆ నీటి బొట్టులో కేసీఆర్ రోజూ మా ఆడబిడ్డలకు కనబడుతున్నడు. మాకు బిందెలు, కుండలు తీసుకొని యుద్ధాలు చేసే పరిస్థితి తప్పించిండు కేసీఆర్.. మా ఇంట్లోకి నీళ్లొస్తున్నయి.. నీటి బొట్టులో కేసీఆర్ ఉన్నడని మా ఆడబిడ్డలు రోజూ ఆశీర్వాదం ఇస్తున్నారని స్పష్టం చేశారు. ఒక ఆడపల్లి పెళ్లి అయితే లక్ష రూపాయలు ఇస్తున్న ఒకేఒక్క నాయకుడు కేసీఆర్ అని వాళ్ల తల్లిదండ్రులు ప్రతీ రోజూ కళ్యాణ లక్ష్మి చెక్కు తీసుకున్నప్పుడల్లా కేసీఆర్‌ను ఒక మేనమామలాగా కేసీఆర్ యాది చేసుకుంటున్నరని కేటీఆర్ గుర్తు చేశారు. అట్లాగే బ్రహ్మాండంగా గోదావరి నీళ్లు తీసుకొచ్చి ఎక్కడ డోర్నకల్, మహబూబాబాద్.. ఎక్కడ గోదావరి.. కాళేశ్వరం ద్వారా ఆ నీళ్లను తీసుకొచ్చి బ్రహ్మాండంగా కోదాడ, సూర్యాపేట దాకా అద్భుతంగా కేసీఆర్ నీళ్లించని ఎక్కడిక్కడ రైతులు యాది చేసుకుంటున్నరన్నారు. రేవంత్ రెడ్డి రైతు బంధు ఎగ్గొట్టిన ప్రతీసారి కేసీఆర్‌ను యాది చేసుకుంటున్నరు. సార్ ఉన్నప్పుడు టింగ్ టింగ్‌మని టైంకు డబ్బులు పడుతుండే. నాట్లు వేసే టైంకు పడుతుండే. మరి ఇప్పుడెంట్లుందిరా నాయనా అంటే ఎప్పుడు పడ్తదో తెల్వది.. రేవంత్ రెడ్డి వచ్చినంక ఎకరానికి పైసలిస్తే దానికో మీటింగ్.. ఎకరానికి పైసలిచ్చుడు ఏదో గొప్ప అన్నట్టు.. అదేదో చేయలేని పని ఏదో చేసినట్టు మీటింగ్ పెట్టుడు.. అందులో ఏముంటది.. కేసీఆర్‌ను తిట్టుడు..బాగా నోటి తీట తీర్చుకునుడు మళ్లీ పోవుడు.. గంతే తప్ప చేసిందేమి లేదన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

(మొదటి తరువాయి)

(బేబీ పాండ్స్) చేరుకొని నిమజ్జన కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంతో విజయవంతంగా నిర్వహించారు. వేడుకలు ప్రశాంతంగా సాగడంలో అత్యంత కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం వేలాది మంది పోలీసులతో భారీ భద్రతను ఏర్పాటు చేయడంతోపాటు నిరంతరం నిఘా పెట్టారు. సిసిటివి కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా, పర్యవేక్షణను చేపట్టారు. నిమజ్జనం శోభాయాత్రల కోసం ముందుస్తుగా ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించడం ద్వారా ఎక్కడా కూడా వాహనాలు జామ్ కాకపోవడంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశారు.

సమన్వయంతో..

నిమజ్జన ప్రాంతాల వద్ద భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్తు సరఫరా, పారిశుధ్య కార్మికులు, తక్షణ సహాయం కోసం ప్రత్యేక బృందాలను జిహెచ్ఎంసి అధికారులు రంగంలోకి దింపారు. ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన కమిటీలు, భక్తులు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి స్థాయిలో సహకరించారు. భారీ భక్తజనసందోహం ఉన్నప్పటికీ, అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయంతో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు నగరంలో ఘనంగా, ప్రశాంతంగా ముగిసేలా నిర్ణయాలు తీసుకున్నారు.

ఖైరతాబాద్ గణపతిని సుమారు 30 లక్షల మంది భక్తులు.. బాలాపూర్ గణనాథుడిని సుమారు 15 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. జిహెచ్ఎంసి పరిధిలో లక్షా 10 వేలు, సిపిసిలో లక్షా 19 వేలు, ఎంఎంసిలో లక్షా 6 వేలకు పైగా గణపతులను నిమజ్జనం చేశారు. పోలీసులు 30 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేయగా.. జిహెచ్ఎంసి 287 క్రేన్లను, 770 మంది పారిశుధ్య కార్మికులను, 137 ప్రాంతాల్లో జలమండలి వాటర్ క్యాంపులను ఏర్పాటుచేశారు. దాదాపు 10,400 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడినట్లు అధికార వర్గాల సమాచారం.

51 వేల మండపాలకు ఉచిత విద్యుత్
రూ.17.80 కోట్ల వ్యయాన్ని భరించిన ప్రభుత్వం

మన తెలంగాణ/హైదరాబాద్: వినాయక చవితి, నిమజ్జన ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా టిజిఎస్పిడిసిఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో 51,207 వినాయక విగ్రహాలు, మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా అందించినట్లు సిఎండి జితేష్.వి.పాటిల్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందుకోసం 1,12,586 కిలోవాట్ల లోడ్ మంజూరు కాగా, ప్రభుత్వం రూ.17.80 కోట్లకు పైగా విద్యుత్ వ్యయాన్ని భరించిందని చెప్పారు.

# గుడిపల్లి సర్వసభ్య సమావేశంలో రసాభాస!

**-నేలపై కూర్చొని దండం పెట్టిన బీఆర్ఎస్ సర్పంచులు**

**-మహిళా సర్పంచ్ పట్ల అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు**



నవ సంఘర్షణ దేవరకొండ (సెప్టెంబర్ 26 : గుడిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని రైతు వేదికలో మండల స్పెషల్ అధికారి రామావత్ దస్రు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా, ఉద్రిక్తంగా సాగింది. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల మధ్య వివక్షతపై బీఆర్ఎస్ సర్పంచులు బహిరంగ నిరసనకు దిగడంతో సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, చిల్కమర్రి సర్పంచ్ దూదిపాల అశ్విని రాజేందర్ రెడ్డి ఒక్కసారిగా నేలపై కూర్చొని అధికారులకు దండం పెడుతూ తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము ప్రతిపక్ష పార్టీ సర్పంచులమనే కారణంతో అధికారులు తమను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని ప్రజా సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని, గత రెండు సర్వసభ్య సమావేశాల్లో కూడా ఇదే విషయాన్ని



లేవనెత్తినా ఫలితం లేదని వాపోయారు. అధికార పార్టీకి చెందిన సర్పంచులు చెప్పే చిన్న పనులు కూడా వెంటనే జరిగిపోతున్నాయని, తమ గ్రామాల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నారని, ఇది పక్షపాత ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యంగా విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు తమ గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా పరిష్కరించడం లేదని, కనీసం గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే, చిల్కమర్రి సర్పంచ్ అశ్విని రాజేందర్ రెడ్డి ఒక మహిళా ప్రజాప్రతినిధి అయి ఉండి నేలపై కూర్చొని దండం పెడుతుంటే, ఒక్క అధికారి కూడా స్పందించి "అమ్మా లేవండి, మీ సీట్లలో కూర్చోండి, మీ సమస్య పరిష్కరిస్తాము" అని అనకపోవడం అని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వారిని అలాగే నేలపై ఉంచి సమావేశాన్ని యథావిధిగా కొనసాగించడం ప్రజాస్వామ్యంలోనే ఒక నల్లమచ్చ అని, మహిళా సభ్యురాలి పట్ల ఇది తీవ్ర అవమానకరమని, సభ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు.

## మొగిలిపేట లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**నవ సంఘర్షణ మల్లాపూర్ :సెప్టెంబర్ 26:**
మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహంకు రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం చాకలి ఐలమ్మ 131 జయంతి పురస్కరించుకొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు సర్పంచ్ గోల్కొండ కళ రమేష్. చాకలి ఐలమ్మ. తెలంగాణ వీర నారి భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం పోరాడి ధీర వనిత గ చరిత్ర పుటలకు ఎక్కరాని కొనియాడారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోల్కొండ కళ రమేష్. మండల బి సి సెల్ అధ్యక్షులు వర్ధ సురేష్. రజక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## మాల్ లో ఘనంగా పోషణ్ అభియాన్ గోడకొండ్లలో పోషకాహారంపై అవగాహన సదస్సు




**నవ సంఘర్షణ - చింతపల్లి, (సెప్టెంబర్ 26 ):**
నల్గొండ జిల్లా, చింతపల్లి మండలం, గోడకొండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ అంగన్వాడీ కేంద్రాల చైర్మన్, గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ ఉద్దేశం ప్రతి ఒక్కరికీ పోషకాహారంపై అవగాహన కల్పించడమేనని అన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్న పిల్లలు తప్పనిసరిగా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు, బియ్యం, పప్పులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం రాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు పోషకాహారం ప్రాముఖ్యత, పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు వివరించారు. గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ స్పెషల్ ఆఫీసర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, గ్రామ మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాసనసభలో వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

**-స్పీకర్, మండలి చైర్మన్ తో కలిసి నివాళులర్పించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్**



**నవ సంఘర్షణ - హైదరాబాద్, సెప్టెంబర్ 26**
వీరనారి చాకలి ఐలమ్మ 106వ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఘనంగా నివాళులు అర్పించారు. శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం, పేదల హక్కుల కోసం నాటి భూస్వామ్య విసునూరి రామచంద్రారెడ్డి దౌర్జన్యాన్ని ధైర్యంగా ఎదిరించిన ధీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. 'ఐలమ్మ జీవితం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ధైర్యానికి, పోరాట పటిమకు ప్రతీక. ఆమె సాగించిన పోరాటం యావత్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకం. తెలంగాణ చరిత్రలో ఆమె పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుంది. భూమి, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన త్యాగాన్ని తరతరాలకు గుర్తుంచుకోవాలి" అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా పేదల సంక్షేమానికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## కబడ్డీ,బాల్ బ్యాట్మెంటన్ పోటీల ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జీ త్రీ జి.యం.



**రామగిరి, నవ సంఘర్షణ**
రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా వర్క్ పీపుల్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 29,30 తేదీలలో నిర్వహించే కంపెనీ స్థాయి కబడ్డీ,బాల్ బ్యాట్మెంటన్ పోటీల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయవలసిన ఏర్పాట్లను శనివారం పరిశీలించిన రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,వారు మాట్లాడుతూ కంపెనీ స్థాయి కబడ్డీ,బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు క్రీడా ప్రాంగణంలో చేయవలసిన పనులు, సింగరేణి అన్ని ఏరియాల నుండి వస్తున్న క్రీడాకారులకు కావలసిన ఏర్పాట్లను చేయాలని,అలాగే వేడుకలకు హాజరయ్యే వారికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.వారి తో పాటు ఎస్వోటు జియం యం.రామ్మోహన్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,సివిల్ డి జి యం ఎస్.రవికుమార్,స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి ఎన్.వంశీధర్,క్రీడల సమన్వయ కర్త బుర్ల సదానందం,ఇతర అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# చింతపల్లి తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**-తెలంగాణ పోరాట స్ఫూర్తిని చాటిన అధికారులు**

**-ఐలమ్మ త్యాగం నేటి తరానికి ఆదర్శం - ఎమ్మార్వో విజయలక్ష్మి**

**నవ సంఘర్షణ - చింతపల్లి, సెప్టెంబర్ 26:**
చింతపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసిల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజయలక్ష్మి మాట్లాడుతూ, భూస్వామ్య వ్యవస్థకు, రాక్షస రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా మహిళా శక్తిని ఏకం చేసి, చేతిలో కొడవలినే ఆయుధంగా



చేసుకొని పోరాడిన గొప్ప యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆమె చూపిన తెగువ, ధైర్యం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, శివ, రికార్డ్ అసిస్టెంట్ వెంకన్న, కురుమేటి కృష్ణయ్య, పెంటయ్య మరియు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ కేంద్ర కమిటీలో ఇసంపల్లి రమేష్ కీలక బాధ్యత

**రామగిరి,నవ సంఘర్షణ**
తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈసంపల్లి రమేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్,టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి,రాష్ట్ర నాయకుడు



పర్లపల్లి రవీందర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. స్థానిక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంఘం వర్క్‌షాప్ కార్యక్రమం అనంతరం వేదికపై రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. సింగరేణి సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న రమేష్,బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా,రామగిరి మండల కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహించారు.అలాగే టీబీజీకేఎస్‌లో పిట్ సెక్రటరీ,రెసిడెన్షియల్ కమిటీ సభ్యుడు,జీఎం కమిటీ సభ్యుడిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తించి కేంద్ర కమిటీలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పదోన్నతి కల్పించినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఈసంపల్లి రమేష్ మాట్లాడుతూ,కేంద్ర కమిటీలో ఈ బాధ్యతలను అప్పగించడం తనపై సంఘం ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం, సంఘ బలోపేతం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. తన ఎదుగుదలకు సహకరించిన కార్మిక సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ పదవి బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,పుట్ట మదన్న, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి,నాయకులు నాగెల్లి సాంబయ్యతో పాటు తనకు సహకరించిన సంఘ నాయకులు,కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆత్మగౌరవ పోరాటానికి ఐలమ్మ ప్రతీక

**-ఐలమ్మ ధైర్యం.. నేటి తరానికి స్ఫూర్తి**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి. వి శ్రీనివాస రావు ఐపీఎస్.**

**మెదక్ జిల్లా నవ సంఘర్షణ**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సామాజిక అన్యాయాన్ని, అణచివేతను ఎదురిస్తూ ఆత్మగౌరవం, హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ



వెనుకడుగు వేయకుండా చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం, మహిళల గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ సూచించారు. యువత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సందీప్ రెడ్డి, శైలందర్, సిబ్బంది పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళు లర్పించారు.

## సంపాదకీయం

# అనర్హతే అసలైన అర్హతనా!



ఎన్నికల్లో గెలిచినోళ్లకు పార్టీలు మారుడు, గోడలు దూకుడు సమయంలో ఎన్నికల ఫలితాల రోజు కంటే ఎక్కువ సంబురం అనిపిస్తది. కానీ, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ యవ్వారం, స్పీకర్ తీర్పు, కోర్టుల తీర్పులు చూసినంక ఆ సంబురం అన్ని సందర్భాల్లో శాశ్వతం కాదని తేలిపోయింది. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్ గూటికి జంప్ అయిన దానంకు హైకోర్టు గట్టిగానే మొట్టికాయలు వేసింది. ఖైరతాబాద్ స్థానం ఎప్పుడో ఖాళీ అయినట్టు లెక్క అని తేల్చిచెప్పింది. హైకోర్టు తీర్పు రాగానే సుప్రీంకోర్టుకు పోనని పెద్ద డైలాగులు కొట్టి, తర్వాత ఉరుక్కుంటూ పోయి అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కిండు. కానీ తీరా అక్కడికి పోయాక సుప్రీంకోర్టు జడ్జీలు సార్ అప్పీల్ను తిప్పికొట్టిర్రు. హైకోర్టు తీర్పులో మేం జోక్యం చేసుకోం.. అని మొఖం మీదే తేల్చి చెప్పేసింర్రు. పార్టీ మారినప్పుడు దానంలో కలిగిన ఆనందం, ఆవేశం ఇప్పుడు కోర్టుల మొట్టికాయలతో మాయమైంది. రాజ్యాంగాన్ని లెక్కచేయకుండా గోడలు దూకితే ఎలాంటి తిప్పలు ఉంటాయో రుజువైంది. మొత్తానికి, ఇప్పుడు బంతి ఖైరతాబాద్ గల్లీల పడ్డది. తమ తీర్పును తేలిగ్గా తీసుకున్న వారికి ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్తారో.

**బూతు మాటలకు సై?!**

వినాయక నిమజ్జనం అంటేనే డప్పుల మోతలు, కోలాటాలు. గణపయ్యకు జై కొడుతూ సాగనంపే సంబురం. ఎవరికి నచ్చిన పాట వాళ్లు ఆనందంతో పాడుకుంటరు. ఇతరులను నొప్పించకపోతే ఎవరికీ ఇబ్బంది ఉండదు కదా! కానీ, ఇప్పుడు ఈ పాటలకూ రాజకీయ రంగు పులుమాలె అని కొందరు భావిస్తున్నట్టున్నది! తాజాగా నిమజ్జన ఊరేగింపుల్లో రాజకీయ పార్టీల పాటలు పెడితే చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియా హ్యాండిల్స్ గుర్తిస్తామని పోలీసు పెద్దలు హెచ్చరించింర్రు. అయ్యా సారూ.. అవి భక్తులు ఎంతో ఇష్టంతో వింటున్న పాటలు. లీడర్లు మైకులు పట్టుకుని బజారున పడి మాట్లాడే బూతు మాటలు కావు కదా! భక్తులకు నచ్చిన పాట పెట్టుకుంటే శాంతిభద్రతల సమస్య ఎట్లయితది? పరిస్థితి ఇలాగే ఉంటే.. నిమజ్జనానికి ముందే పాటల లిస్ట్ చూపించాలని నిర్వాహకులను అడుగుతరేమో! పోలీసుల డ్యూటీ పాటల్లో పార్టీలను వెతకడం కాదు, ప్రజల మధ్య శాంతిని కాపాడడం కదా!

**ఉద్యోగులను ఊరించుడే ఊరటనా?**

ఇదిగో డీఏ... అదిగో పీఆర్సీ అంటూ సర్కారోళ్లు ఉద్యోగులను ఊరిస్తుంర్రు. పెండింగ్ డీఏలు బ్యాంక్ ఖాతాలో పడ్తయట అంటే సంబురపడుతున్నరు. కానీ డీఏలు మాత్రం ఆరుకు పెరిగినయి. వీటికి లెక్కలు కట్టేసరికి ఉద్యోగులకు చుక్కలు కనపడుతున్నయి. ఈ 'ఊరింపుల' డీఏల కోసం ఎదురు చూసి చూసి నిట్టూరుస్తున్నరు. నాయకుల గురించేం చెప్పాలి? వాళ్ల ఎస్టిమేషన్ల లీలలు చూస్తే ఉద్యోగులకు తలకాయ తిరుగుతాంది. పొద్దున లేస్తే పీఆర్సీ చర్చలంటూ కమిటీలు, కమిషన్లని అధికారులు ఇరగదీస్తున్నారు. ఆ ఊహాజనిత లెక్కల మాయలోపడి వాళ్లు ఏనాడు సంతోషంగా ఉన్నారో మర్చిపోయింర్రు. కూలి పనిచేసేటోళ్లకు సాయంత్రానికి పైసలు వస్తున్నయి. ఏ కూలీని చూసినా ఉన్నంతలో హాయిగా బతుకుతున్నరు. కంటినిండా నిద్ర పోతున్నరు. కానీ ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి పేరుకు గొప్పగా ఉన్నా నెల తిరిగేసరికి కిరాణా దుకాణం బాకీలు, ఈఎంఐల గోసతో బతుకు బస్టాండే అయితాంది. ఉద్యోగ సంఘాల నాయకుల కథ వేరే ఉన్నది. ఆరని ఆశలు, ఆకాశాన్నంటే అంచనాల ప్రకటనలు ఇకనైనా బంద్ చేయాలని ఉద్యోగులే కోరుతుంర్రు. ఈ ఆవేదన ప్రభుత్వానికి ఎప్పుడు అర్థమవుతదో!

**సీఎం 'అవార్డు' సంబురం!**

సీఎం రేవంత్‌రెడ్డికి కేరళంలోని 'ఆర్యధాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఉత్తమ ప్రజా సేవకుడు అని ఓ పురస్కారం ఇచ్చింది. 2022లో పెట్టిన ఈ ఫౌండేషన్ ఇప్పటికి ఇచ్చింది రెండే రెండు అవార్డులు. విశేషం ఏందంటే.. మొట్టమొదటి అవార్డు 2023లో అప్పటి కేరళ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ లీడర్ వీడీ సతీషన్‌కు ఇచ్చింర్రు. ఇగ రెండో అవార్డు రేవంత్‌రెడ్డి గారికి దక్కింది. కాంగ్రెస్ నేత పేరుతో పెట్టిన ఫౌండేషన్, కేవలం కాంగ్రెస్ నాయకులకే అవార్డులు ఇచ్చుకుంటూ పోతుంటే.. భజన మీడియా మాత్రం దాన్ని గొప్ప అవార్డు అంటూ మోత మోగిస్తున్నది. ఇంకా అసలు హైలైట్ ఏందంటే.. ఈ అవార్డు తీసుకోవడానికి సీఎం ప్రత్యేక విమానంలో కేరళకు పోయివచ్చింర్రు. అక్కడి కాంగ్రెస్ ముఖ్యమంత్రి, తొలి అవార్డు గ్రహీత వీడీ సతీశన్ ఆ సభకు హాజరుకాలేదు. ఈ అవార్డు అందుకున్న మొదటి కేరళేతర వ్యక్తి తానేనంటూ రేవంత్‌రెడ్డి మురిసిపోతుంటే.. ఎవరి సంఘం వాళ్లకు అవార్డు ఇచ్చుకుంటే కూడా ఇచ్చంత్రమేనా అని విమర్శలు వినిపిస్తున్నయి. అయితే, ఈ సభలో రేవంత్ ఇంగ్లిష్ స్పీచ్‌ను మళయాళంలోకి అనువదించేందుకు అనువాదకుడు పడ్డ అవస్థ, ఆయన ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది.

**ముల్లుకట్టె పడితేనే కదుల్తరా?**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒకటే దృశ్యం కనబడుతున్నది. ఏ విషయంలోనైనా బీఆర్ఎస్ గట్టిగా కొట్లాడితేనే తప్ప, సర్కార్‌లో చలనం వస్తలేదు. ప్రభుత్వం చేసే పనుల తీరు చూస్తుంటే, ప్రతిపక్షం ముల్లుకట్టె పెట్టి పొడిస్తే గానీ ఈ బండి ముందుకు సాగడంలేదని స్పష్టంగా అర్థమవుతున్నది. ఉదాహరణకు.. జూరాల నుంచి నీటి విడుదల కోసం గులాబీ నేతలు రోడ్డెక్కి కొట్లాడింర్రు. తాగునీరే దిక్కులేదు, సాగునీరు ఎట్లా? అని అప్పటివరకు దబాయించిన మంత్రులే ఆఘమేఘాల మీద నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేసింర్రు. ఇక విద్యుత్ ప్లాంట్లు బంద్ అయితన్నయ్, మేము స్వయంగా పరిశీలనకు వస్తామని బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటించగానే.. సీఎం కదిలిండు. విద్యుత్ అధికారులతో సమీక్ష జరిపి, ప్లాంట్లు ఫుల్లుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేసిర్రు. 22-ఏ బాధితులతో దండెత్తుతామని బీఆర్ఎస్ అల్టిమేటం ఇవ్వగానే సర్కార్ దిగివచ్చింది. అనుమతులు ఉన్నవాటికి రిజిస్ట్రేషన్లు ఆపబోమని చెప్పకతప్పలేదు. ఇదంతా చూస్తుంటే.. ప్రజా సమస్యలపై ప్రభుత్వం తనంతట తానుగా స్పందించి ఇస్తున్న భరోసా కంటే, ప్రతిపక్షం నిలదీస్తేనే పనులు జరుగుతున్నాయని తేటతెల్లమవుతున్నది

# మానవాళిపై ఏఐ ప్రభావం ఎలా?

**ప్రపంచంలో ఏం జరుగుతున్నదో మీరంతా గమనిస్తున్నారా? మీరు సరిగా నిద్రపోతున్నారా? నేనయితే సరిగా నిద్ర పోవడంలేదు. ఒక కీలకమైన నాగరికతకు సంబంధించిన మార్పును పరిశీలిస్తున్నాను. ఇలాంటి క్లాస్‌లు చెప్పడం, కోర్సులు మనుగడ సాగిస్తాయని అనుకుంటున్నారా? ఇది కోర్సుకు, మీకు, నాకు సంబంధించిన విషయం కాదు, ఇది మానవాళికి సంబంధించిన అంశం. ఇప్పుడు మనమంతా ఒక కొత్త నాగరికతకు సంబంధించిన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. దీన్ని ప్రజలు గమనిస్తున్నారో, లేకపోతే నేనే ఓ గోడపై దెయ్యం బొమ్మను చిత్రీకరిస్తున్నానో తెలియడంలేదు. అసలు ఏం జరుగుతున్నదో మీరు గమనిస్తున్నారా? ఏఐ విషయంలో చాలా రకాల వేదాంతపరమైన, తాత్వికమైన, మనుగడకు సంబంధించిన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.**



ఒకవేళ విజ్ఞానం, ఆలోచించడం అనేవి వాణిజ్య వస్తువులుగా మారితే, మన మనుగడకు అర్థమేముంటుంది? ఇన్నాళ్లూ మానవులుగా మనం మేధస్సు కలిగిన వాళ్లం అని అనుకుంటూ ఉన్నాం. ఇప్పుడు యంత్రాలు కూడా అదే పనిచేస్తున్నాయి. సరే, అదొక తాత్వికమైన వాదన. కానీ ఆర్థికపరమైన పరిణామాల గురించి ఆలోచించండి. నా జీవితంలో ఏం జరుగుతున్నదో చెప్తాను. నేను సిబ్బందిని నియమించుకోవడం ఆపేశాను. ఎందుకంటే మనుషులు ఇకపై పనిని సులభతరం చేసేవారిగా కాకుండా, అడ్డంకులుగా మారారు. నా కోసం వంద మంది ఏఐ ఏజెంట్స్ సమాంతరంగా పని చేస్తుంటే, నేను సిబ్బందిని నియమించుకోవాల్సిన అవసరమేమున్నది? నాకు ఒక ఆలోచన వచ్చింది. నేను 100 మంది ఏజెంట్లను స్పిన్ చేసి, మరికొన్ని క్లాట్ సబ్‌స్క్రిప్షన్‌లను పొందుతాను. ఇక మనుషుల అవసరమేముంటుంది? కొన్ని రోజుల క్రితం నేను హింటన్ ప్రసంగం విన్నాను. ఆయన ఏం చెప్పారంటే మేధస్సు వ్యాపార సరుకైతే, అది చౌకకు దొరికితే, ఆలోచన కూడా తక్కువ ధరకు లభిస్తే ఏం జరుగుతుంది? అనేది వివరించారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థ అంతా కూడా మేధస్సు, జ్ఞానం మీద ఆధారపడి నడుస్తున్నది. ఇప్పుడు అది వ్యాపార వస్తువుగా మారి, చౌకగా దొరికితే తర్వాత పరిస్థితి ఏంది? ఒక గొప్ప ఆలోచన దృక్పథం ఏందంటే, ఏఐ ద్వారా చాలా పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతుంది. ఎందుకంటే ఉత్పత్తి ఖర్చు తగ్గిపోతుంది కాబట్టి. ఇలాంటి పరిస్థితిలో ఎవరైనా సంతోషంగానే ఉంటారు కదా! కానీ అది జరుగుతుందా? హింటన్ వాదన ఏందంటే పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి అనేది ప్రతి ఒక్కరికీ సంతోషంగా మారలేదు. ఇది కేవలం ఎక్కువ ఉత్పత్తి ఉన్నవాళ్లకు, ఏమీ లేని వాళ్లకు మధ్య విభజనను మాత్రమే సృష్టిస్తుంది. ప్రతిభ ఆధారిత వ్యవస్థలో సమయం, శ్రమను వెచ్చించి కొందరు జ్ఞానం పొందుతారు. సమాజంలో నైపుణ్యం ఆధారంగా అంచెలవారీ వ్యవస్థ ఉన్నది. ఇప్పుడు అది తొలగించి చూడండి. మనుషులంతా సమానం, కొందరు 'ఎక్కువ' సమానం అవుతారు. ఎందుకంటే ఆ కొందరు మేధస్సును సృష్టించగలరు కాబట్టి. మీకు తెలుసా? జీపీటీ ఆస్ట్రా జీపీ 6 అనేది లక్ష జీపీయూలను ట్రైన్ చేసింది. మన దేశం కూడా లక్ష జీపీయూలను కలిగి లేదు. ఎవరైతే అలాంటి వ్యవస్థను నియంత్రించగలరో వాళ్లే జాగీర్దారుల తరహాలో తయారవుతారు. ఏ వస్తువులు ఎక్కడికి వెళ్లాలో నిర్ణయిస్తారు. అప్పుడు ఏం జరుగుతుంది? ప్రపంచంలో 50 ఏండ్లుగా ఏర్పడిన తరహా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇప్పటికే ఉద్యోగాల తొలగింపును చూస్తున్నాం.. ఇంకా చూస్తాం. కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వవు, అప్పుడు యూనివర్సిటీలు ఏం చేయాలి? ప్రభుత్వాలు ఏం చేయాలి? అసలు యూనివర్సిటీల్లో ఏం బోధించాల్సి ఉంటుంది? విద్యార్థులను క్లాస్‌రూమ్‌లో కూర్చోబెట్టి అల్గారిథం రాయాలని చెప్పాల్సిన అవసరం ఏముంటుంది? మనుషులుగా మనకు ఎలాంటి అవకాశాలు లేకపోతే, మనం ఏం చేయాలి? ఆర్థికశాస్త్రాన్ని ఎలా నిర్వహించాల్సి ఉంటుంది? క్రమంగా వస్తు మార్పిడి పద్ధతి వస్తుందేమో! నేనొక ఆర్టికల్ చదివాను. అందులో ఏమున్నదంటే! ప్రతి ఒక్కరికీ ఉండటానికి చోటు, తినడానికి తిండి, వినోదం కోసం ఏవైనా యూట్యూబ్ వీడియోస్ చూసుకునే అవకాశం కల్పిస్తే అందరూ సంతోషంగా ఉంటారా? ఉండము. రోడ్ల మీదకు వచ్చి ఫైట్ చేస్తాం. ఎందుకు అంటే.. ఏమో చెప్పలేం. సమాజం ఎక్కడికి పోతున్నదో కూడా అర్థం కావడంలేదు. ఇలాంటి చర్చలు జరుగాలి. ఎవరో ఒకరు ఏదో చేయాలి. ఇప్పుడిదంతా తాత్వికమైన చర్చగా మారింది. మరో వాదన కూడా ఉన్నది. నా భార్య తరచుగా అడుగుతూ ఉంటుంది. కాలిక్యులేటర్లు వచ్చాయని మనం కూడికలు, తీసివేతలు వంటివి నేర్చుకోవడం మానేయలేదు కదా అని. నిజమే కదా, అది సరైన వాదననే. ఇక మీరంతా నా క్లాస్‌రూమ్‌కు రాకపోయినా ఏఐ ద్వారా నేర్చుకునే అవకాశం ఉంటే, రావాల్సిన అవసరమేముంటుంది? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. మా కూతురు చెప్తున్నది. జీపీటీ బెస్ట్ టీచర్, మీకంటే ఓపికగా సమాధానం చెప్తున్నది. ఎన్నిసార్లు అడిగినా విసుక్కోకుండా, తిట్టకుండా నేర్పిస్తున్నది అని అంటున్నది. అవన్నీ కూడా సరైన వాదనలే కదా! ఇంకా మౌలిక ప్రశ్న ఏందంటే.. అసలు మనం ఎందుకు నేర్చుకోవాలి? అనేది ఒక ప్రశ్న అయితే, ఏం నేర్చుకోవాలి? అనేది ఇంకో ప్రశ్న. అలాగే మీరంతా నేర్చుకోవడానికి ఇక్కడికి ఎందుకు వచ్చారు. సరే, మనుషులు సోషల్ యానిమల్స్ కాబట్టి, సోషలైజ్ కావడానికి వచ్చామంటే ఓకే. సోషలైజ్ కావడానికే అంటే పార్క్‌కు పోవచ్చు, యూనివర్సిటీకే ఎందుకు వచ్చారనేది మరో ప్రశ్న కదా! యూనివర్సిటీ అంటే మేధోపరమైన అంశాలపై చర్చిస్తూ ఉత్తేజం పొందే స్థలం అని చెప్పడం బాగుంది కదా! సాంకేతిక రంగంలో వచ్చే మార్పులు కింది నుంచి పైస్థాయికి ఉండవు. పై నుంచి కిందికి ఉంటాయి. కాబట్టి ఇలాంటి అంశాలపై ముందుగా మనలాంటి వాళ్లం చర్చించుకోవాల్సిన అవసరమున్నది. దీనిపై అంతా చర్చించుకోవాలి. ఎందుకంటే అందరిలోనూ ఆందోళన వ్యక్తమవుతున్నది. నా అభిప్రాయం ప్రకారం మనలో తగినంత సృజనాత్మకత లోపించింది. ఉదాహరణకు ఒక తరగతి గదిలో 100 మంది విద్యార్థులు ఉన్నారని అనుకుందాం. మనం వారికి 100 వేర్వేరు సమస్యలను ఇచ్చి, వారి ప్రతిభను అంచనా వేయడానికి ఒకటే పద్ధతిని అనుసరించగలమా? లేదు. చివరికి మనం ఇచ్చే గ్రేడ్ అనేది పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయం మీద ఆధారపడి ఉంటుంది. ఒకవేళ నేను మీకు ఒక ఓపెన్ ప్రాబ్లెమ్ ఇచ్చి, మీకు నచ్చినట్టుగా పరిష్కరించండి అని అడిగాను అనుకోండి. అప్పుడు ఆ 100 మంది విద్యార్థులూ ఒక లార్జ్ లాంగ్వేజ్ మాడల్‌కు ఒక ప్రాంప్ట్ ఇచ్చి, దాని ద్వారా వచ్చిన సమాధానాన్ని సబ్మిట్ చేస్తే, నేను వాటిని ఎలా విశ్లేషించాలి? ఎవరికీ తెలియదు. అసలు ఈ కంపెనీలు, ఈ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? అందుకే నేను ఆర్థిక వ్యవస్థ గురించి అడిగాను. రానున్న ఐదేండ్లలో ఆర్థిక పరిస్థితి ఎలా ఉండబోతున్నది? దీనికి మన దగ్గర ప్రస్తుతానికి సమాధానం లేదు. అసలు మనం ప్రజలకు దేని కోసం శిక్షణ ఇవ్వాలి? మన చర్చ మొదలు పెట్టినప్పుడు నేను అడిగిన ప్రశ్న అదే కదా. సరైన ప్రాంప్టింగ్ కోసమా? అసలు సరైన ప్రాంప్టింగ్ అంటే ఏమిటి? ఒక సమాజంగా, మానవులుగా మన లక్ష్యం ఏంది అని ఆలోచిస్తే.. మనం ఎటువైపు వెళ్తున్నామో, అసలు మనం పరిష్కరించాల్సిన సమస్య ఏమిటో నాకు స్పష్టంగా తెలియడంలేదు. చారిత్రకంగా చూస్తే, విశ్వవిద్యాలయాలు ఎలా రూపుదిద్దుకున్నాయో మీకు తెలుసు కదా! సోక్రటీస్ వంటి వారు తమ చుట్టూ కొందరు తెలివైన వారిని చేర్చుకుని, రకరకాల విషయాలపై చర్చించేవారు. మనం ఇప్పుడు చేస్తున్నది కూడా సరిగ్గా అదే కదా. నిజంగా నేర్చుకునే విధానం ఇలాగే విషయాలపై చర్చ ద్వారా ఉండాలని నా అభిప్రాయం. కేవలం ఐదుగురు సభ్యులను మాత్రమే ఒక కోర్సులో చేర్చుకుని, ఒక బృందంగా కలిసి పని చేసి, తదుపరి బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని నిర్మించే పద్ధతిని అనుసరించవచ్చు కదా. ఒకవేళ ఆ కోర్సులో 100 మంది నమోదైతే అప్పుడు పరిస్థితి ఏంది? అన్ని రకాల నైపుణ్యాలు కలిగిన ప్రజలు ఉన్న దేశంలో మనం ఏం చేస్తాం? బహుశా గిట్‌హబ్‌లో మీరు రూపొందించిన ప్రాజెక్టుకు ఎన్ని స్టార్స్ వచ్చాయనే దాని ఆధారంగా మీకు గ్రేడ్ ఇస్తామని వారికి చెప్పవచ్చు. ఇటీవల ఒక స్కూల్‌లో టీచర్స్ డే ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆ కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే వెళ్లాను. అక్కడ అటెండెన్స్ అనే సిస్టమ్ తీసేస్తే, ఎంతమంది స్టూడెంట్స్ స్కూల్‌కు వస్తారు? అని నిర్వాహకులను నేనొక ప్రశ్న అడిగాను. వాళ్లు షాక్ అయ్యారు. నేను హైస్కూల్‌కు వెళ్తున్నప్పుడు జైలుకు వెళ్తున్నట్టు ఫీలయ్యేవాడిని. ఆ పరిస్థితిని చాలా ద్వేషించేవాడిని. మీలో కూడా చాలామందికి ఇలాంటి అనుభవమే ఉండి ఉంటుంది. మనం సంతోషం లేని ప్రదేశాలను ఎందుకు సృష్టిస్తున్నాం. విద్యార్థులు వికాసదశలో ఉన్నప్పుడు స్కూల్‌కు వెళ్లి 8 గంటలు గడిపి, బాధాకరమైన మనస్సుతో తిరిగి ఇంటికి రావడం చూస్తున్నాం. ఇక అలాంటి పరిస్థితినే యూనివర్సిటీలో కూడా చూస్తే మనం ఏదో తప్పు చేస్తున్నట్టే కదా! ఇక్కడ మీకొక చిన్న కథ చెప్తాను. అది బిచ్చి అనే కన్నడ రచయిత రాశారు. నాలుగైదేండ్ల పిల్లవాడు, తన తల్లితో నడుస్తూ వెళుతున్నాడు. ఓ గొర్రెను బలి ఇచ్చేందుకు లాక్కెళుతుండటాన్ని చూశాడు. ఆ గొర్రెకు దండలు వేసి ఉన్నాయి, దాన్ని బాజాభజంత్రీలు వాయిస్తూ తీసుకెళ్తున్నారు. ఆ పిల్లవాడు ఆసక్తితో అతడిని తల్లిని ఇలా అడిగాడు. 'ఆ గొర్రెను ఎక్కడికి తీసుకెళుతున్నారు?' అని. ఆ తల్లి చాలా విషాదకరమైన మొహంపెట్టి, 'ఆ గొర్రెను బలి ఇచ్చేందుకు తీసుకెళుతున్నారు' అని చెప్పింది. అప్పుడు ఆ పిల్లవాడు ఏమన్నాడంటే 'అవునా.. అంతేనా.. నేనింకా ఆ గొర్రెను స్కూల్‌కు తీసుకెళ్తున్నారు అనుకున్నాను' అని సమాధానం చెప్పాడు. అంటే బలి ఇవ్వడం కంటే స్కూల్‌కు తీసుకెళ్లడం దారుణం అని ఆ పిల్లవాడి భావన. నేను కూడా స్కూల్‌కు వెళ్లడానికి ఇష్టపడేవాడిని కాదు. హైట్ ఉండటం వల్ల వెనుకబెంచీలో కూర్చునేవాడిని. ఫిలాసఫీ పుస్తకాలు చదువుకునేవాడిని. క్లాస్ రూమ్ పాఠాలు బోర్ కొట్టేవి. వంద మందిని కూర్చోబెట్టి ఒక వ్యక్తి ప్రసంగించే తరహా వాతావరణాన్ని సృష్టించాం. అందుకే మిమ్మల్ని అడుగుతున్నాను. మీరు క్లాస్‌కు ఎందుకు వస్తున్నారు? అని. నా పదేండ్ల టీచింగ్ కెరియర్‌లో ఇలాంటి చర్చ ఎప్పుడూ చేయలేదు. ఇప్పుడు సమయం వచ్చిందనిపించి, చెప్పాను. ఇప్పుడు కూడా చెప్పకపోతే మనల్ని మనం మోసం చేసుకున్నట్టు అవుతుంది కదా!

# ఇరాన్ శాంతి ప్రతిపాదనకు ట్రంప్ నో

**మధ్యంతర ఎన్నికల తర్వాత మళ్లీ ఇరాన్‌పై దాడి చేసే అవకాశం**



**వాషింగ్టన్, సెప్టెంబర్ 26:**

ఇరాన్ చేసిన ఏడు రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించినట్టు సమాచారం. నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత టెహ్రాన్‌పై యూఎస్ బాంబు దాడులను ప్రారంభించే అవకాశం ఉంది. తమ డిమాండ్లను అమెరికా నెరవేరిస్తే ఏడు రోజుల్లో వ్యూహాత్మక జలసంధిని తెరిచేందుకు, యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేసేందుకు ఇరాన్ ప్రతిపాదించింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో జరిగిన ఈ ఏడు రోజుల ప్రణాళికను కనుక ఆమోదిస్తే హెర్మూజ్‌లో వారం రోజుల్లోనే నౌకల రాకపోకలు యథావిధిగా కొనసాగేందుకు సహకరిస్తామని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం ఐరాసలో మీడియాకు తెలిపారు. ఒత్తిడిని, బెదిరింపులను ఇరాన్ ఎంతమాత్రం అంగీకరించదన్నారు.

# బీజేపీని గెలిపించడానికే బెంగాల్‌లో 'సర్'

**మమతా బెనర్జీ ఆరోపణ**



**కోల్‌కతా, సెప్టెంబర్ 26**

ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించి, బీజేపీని బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో గెలిపించడానికే ఎన్నికల సంఘం ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను నిర్వహించిందని మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. మైనారిటీల ప్రాబల్యం ఉన్న రిజీనగర్ ఉప ఎన్నికకు అధికార బీజేపీ తరపున పోలీసులు పనిచేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా కోల్‌కతా వెలుపల హుగ్లీలోని సెరమ్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో ఈసీని బీజేపీ ఎలా దుర్వినియోగం చేసిందనే నిజం ఇప్పుడు బయటపడిందన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయన్నారు. సర్ పేరిట బెంగాల్‌లో 93 లక్షల ఓట్లను తొలగించారని ఆమె విమర్శించారు.

## మధురాపురంలో రెడ్డి సేవా సంఘం
# వినాయకుడి వద్ద మార్మోగిన లడ్డూ వేలం..

**- రూ.11 లక్షల 11వేల 111 లకు మల్కయ్య సునీత వెంకట్‌రెడ్డి దంపతుల కైవసం**

రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 26 నవ సంఘర్షణ

షాద్‌నగర్ పరిధిలోని మధురాపురం గ్రామంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు ఉత్సాహంగా పోటీ పడ్డారు.

వేలం పాటలో పలువురు పోటీదారులు భారీగా సవాళ్లు చేయగా, చివరకు మల్కయ్యగారి సునీత వెంకట్‌రెడ్డి దంపతులు రూ.11 లక్షల 11 వేల 111కు లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. గణనాథుడి పవిత్ర ప్రసాదం తమ కుటుంబానికి దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు వారు తెలిపారు.

మధురాపురంలో వినాయక చవితి సందర్భంగా లడ్డూ వేలం పాటకు ఏటా ఆదరణ పెరుగుతూ వస్తోంది. భక్తులు గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తుండటంతో ప్రతి ఏడాది వేలం పాటలో పోటీ మరింత పెరుగుతోంది.



మధురాపురం వినాయకుడి లడ్డూ వేలం చరిత్రను పరిశీలిస్తే 2011లో రూ.41,116తో ప్రారంభమైన వేలం పాట 2026 నాటికి రూ.11,11,111కు చేరుకుంది. 2018లో రూ.1,05,300, 2019లో రూ.2,31,111, 2021లో రూ.13,62,116, 2022లో రూ.11,16,116, 2023లో రూ.11,51,116, 2024లో రూ.9,32,116, 2025లో రూ.12,00,116 పలికిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన వినాయక చవితి వేడుకలు, లడ్డూ వేలం కార్యక్రమం సందడిగా సాగింది.

## అణచివేతపై పోరాటానికి
# ప్రతీక చాకలి ఐలమ్మ
### షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్



రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 26 నవ సంఘర్షణ

అన్యాయాన్ని, అణచివేతను ఎదిరించి హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ జీవితం తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆమె విగ్రహానికి అంజయ్య యాదవ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చాకలి ఐలమ్మ తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంతో పాటు పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన ధీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అన్యాయానికి తలొగ్గకుండా హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి కూడా స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, సామాజిక న్యాయం కోసం ధైర్యంగా నిలబడేందుకు ఐలమ్మ జీవితం మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ ఆశయాలను స్మరించుకోవడమే కాకుండా, ఆమె పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అంజయ్య యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, పిన్నమోని గోపాల్, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, కానుగు అంతయ్య, నందకిషోర్, నాయకులు రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్, జుట్టు బాలరాజు, శ్రీను, కొండ మల్లేష్, జమాల్ ఖాన్ తదితరులతో పాటు రజక సంఘం నాయకులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు.

# అధికారం అడ్డం పెట్టుకుని అంతస్తులు సంపాదిస్తే "జాతిపితలు" కాలేరు

**-అడ్డంగా సంపాదించిన ఆస్తులను ఉద్యమకారులకు పంచాలి**

**-తెలంగాణ ఆర్థిక విధ్వంసంపై నిజ నిర్ధారణ చేస్తామన్న ఎమ్మెల్యే శంకర్**



రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 26 నవ సంఘర్షణ

తెలంగాణ సెంటిమెంటు, అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని అడ్డగోలుగా సంపాదించిన ఆస్తులను తెలంగాణ ఉద్యమకారులకు పంచి పెడితే సూర్యచంద్రులు ఉన్నంతకాలం కెసిఆర్ పేరు నిలిచి ఉంటుందని, తాను కూడా కెసిఆర్ ను కీర్తిస్తానని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో రజక సంఘం, జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన నివాళి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై నివళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణ సెంటిమెంటును అడ్డం పెట్టుకుని పాలన పేరిట ఆర్థిక విధ్వంసం జరిగిందని శంకర్ అన్నారు. గడిచిన బిఆర్ఎస్ పాలనలో అక్రమంగా ప్రజల సొత్తును కూడా పెట్టారని ఆరోపించారు. కెసిఆర్ ఆస్తులు అంతస్తులు అక్రమాలు దౌర్జన్యాలు పెచ్చు మీరి పోయాయని వివరించారు. తెలంగాణ సెంటిమెంటుతో కెసిఆర్ అనే కుటుంబం లాభం పొంది ఉద్యమకారుల కడుపులు కొట్టి ప్రజల ఆస్తులను ధ్వంసం చేసి సొంత ఆస్తులు కూడా పెట్టారని వీటిని కనుగొని ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిజనిర్ధారణ కమిటీలో తాను ఒక సభ్యుడునని వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువస్తానని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కెసిఆర్ అవినీతి చూసి మహనీయులు చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి వారి ఆత్మలకు క్షోభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవ కోసం వచ్చి రాష్ట్రం కోసం ఏదైనా సొంతంగా త్యాగం చేస్తే జాతిపితలు అవుతారని మంది సొమ్ము మింగి అంతస్తులు కూడా పెడితే వారిని జాతిపితలు అనరని అన్నారు. ఒకవేళ కెసిఆర్ పేరు సూర్య చంద్రులు ఉన్నంతకాలం చిరస్థాయిగా మిగిలాలంటే నాలాంటివారు కీర్తించాలంటే ఆయన అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను ఉద్యమకారులకు ప్రజలకు పంచిపెడితే జాతిపిత కచ్చితంగా అవుతాడని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కెసిఆర్ తన అక్రమ ఆస్తులను ప్రజలకు త్యాగం చేస్తే సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయనను గౌరవిస్తాం పూజిస్తాం అంటూ ఎమ్మెల్యే శంకర్ సవాల్ విసిరారు. ప్రాంతం కోసం దేశం కోసం త్యాగం చేసిన మహనీయులు ఎందరో ఉన్నారని ఇలా అక్రమ ఆస్తులు ఎవరు కూడా పెట్టలేదని దేశంలోనే అక్రమ ఆస్తులు కూడబెట్టిన నేతల్లో కేసీఆర్ ప్రప్రథముడు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నందిగామ రామచందర్, పెంటయ్య, శేఖర్, లింగారెడ్డిగూడెం అశోక్, అదేవిధంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘునాయక్, మాజీ జెడ్పిటిసి పంది వెంకట్రాంరెడ్డి, స్థానిక జేఏసీ చైర్మన్ మూలే జనార్దన్. కరుణాకర్, చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, జాంగారి రవి, డంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా
# కాంతార వినాయకుడి లడ్డూ వేలం

**- రూ.6.30 లక్షలకు మొదటి లడ్డూను సొంతం చేసుకున్న మల్లయ్య గారి గోవర్ధన్‌రెడ్డి**



రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 26 నవ సంఘర్షణ

షాద్ నగర్ పట్టణంలోని వెంకటేష్ థియేటర్ ఆవరణలో స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంతార వినాయకుడి మండపంలో 12 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడి లడ్డూలకు నిర్వహించిన వేలం పాటకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.వేలం పాటలో మొదటి లడ్డూను మధులరాపూర్ గ్రామానికి చెందిన, శేరిగూడ ఉప సర్పంచ్ మల్కయ్యగారి గోవర్ధన్‌రెడ్డి రూ.6.30 లక్షలకు కైవసం చేసుకున్నారు. రెండో లడ్డూను కృష్ణ స్వీట్ హౌస్ నిర్వాహకులు రూ.3.01 లక్షలకు సొంతం చేసుకున్నారు. వేలం పాటను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా వినాయకుడి శాలువాను సాత్విక్ రూ.57 వేలకు కైవసం చేసుకున్నారు. 11 కిలోల వినాయకుడి లడ్డూను లక్కీ డ్రా ద్వారా మొగిలిగిద్దకు చెందిన అనుమూరి భవిష్య గెలుచుకున్నారు. స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు వేలం ప్రక్రియను నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. లడ్డూలు, శాలువా కైవసం చేసుకున్న విజేతలను నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందుతూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

## హెచ్ఐవీ సేవలపై
# టీజీఎస్ఏసీఎస్ ప్రత్యేక దృష్టి

**-హెచ్ఐవీ బాధితులకు చికిత్స అనుసంధానం బలోపేతం...**

**-ప్రైవేటు ఆసుపత్రుల్లో హెచ్ఐవీ సేవలపై పర్యవేక్షణ**

నాగారం, సెప్టెంబర్ 26:-నవ సంఘర్షణ

మల్కాజ్‌గిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో హెచ్ఐవీ--టీబీ సేవల అమలును తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజీఎస్ఏసీఎస్) అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజేశం శనివారం పరిశీలించారు. మొబిలైజేషన్ ఫర్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సహాయక పర్యవేక్షణలో 95-95-99 సూచికల పురోగతిని సమీక్షించారు. ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ)లో హెచ్ఐవీ పరీక్షలు, నిర్ధారణ రికార్డులు, నెలవారీ పరీక్షలు, కొత్తగా గుర్తించిన హెచ్ఐవీ బాధితులను ఏఆర్‌టీ సేవలకు అనుసంధానిస్తున్న తీరును పరిశీలించారు. హెచ్ఐవీ--టీబీ పరస్పర రిఫరల్స్, లబ్ధిదారుల ఫాలోఅప్‌పై ఆరా తీశారు.అనంతరం సీబీనాట్ కేంద్రాన్ని సందర్శించి టీబీ రికార్డులు, హెచ్ఐవీ--టీబీ సహవ్యాధి కేసులు, చికిత్స, ఫాలోఅప్ వివరాలను పరిశీలించారు. అర్హులైన హెచ్ఐవీ బాధితులకు వైరల్ లోడ్ పరీక్షలు, వైరల్ లోడ్ అణచివేతకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. రక్తనిధిలో స్వచ్ఛంద రక్తదాన సేకరణ, హెచ్ఐవీ స్క్రీనింగ్ పరిస్థితిని కూడా పరిశీలించారు.మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా ఇప్పటికే మొదటి, మూడో 95 సూచికలను సాధించిందని, ప్రస్తుతం రెండో 95పై ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉందని డాక్టర్ రాజేశం తెలిపారు. గుర్తించిన హెచ్ఐవీ బాధితులను ఏఆర్‌టీ సేవలకు అనుసంధానించి, చికిత్సలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రైవేటు ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను జిల్లా బృందం క్రమబద్ధంగా సందర్శించి, అక్కడ ఏఆర్‌టీ సేవలు పొందుతున్న వారిని గుర్తించి కార్యక్రమానికి అనుసంధానం చేయడంతో పాటు చికిత్స కొనసాగింపు, ఫాలోఅప్‌ను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి హెచ్ఐవీ, టీబీ సేవలు అందేలా ఖచ్చితమైన రికార్డులు, సకాలంలో రిఫరల్స్, సమర్థవంతమైన సమన్వయం, నిరంతర ఫాలోఅప్ అవసరమని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో డాక్టర్ వై. శ్రీదేవి, డాక్టర్ రాధ, డాక్టర్ మాధురి, డాక్టర్ పి. వినోద్, సంజీవ్, రమేష్, కల్పన, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా
# ఎన్. నర్సింలుకు పురస్కారం



నవ సంఘర్షణ పరిగి సెప్టెంబర్ 26

వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఎన్. నర్సింలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, తాండూరు శాసనసభ్యులు బి. మనోహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) అబ్దుల్ ఘని ముఖ్య అతిథులుగా హాజరై నర్సింలును శాలువా, పూలదండ, జ్ఞాపిక (మెమెంటో) మరియు ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మిట్టకోడూర్ గ్రామ సర్పంచ్ పి. మాణిక్యం మాట్లాడుతూ... తమ గ్రామ పాఠశాలలో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయునికి జిల్లా స్థాయి గుర్తింపు రావడం ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి. ఉస్మాన్ అలీ, 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ' చైర్మన్ అనితారాణి, ఉపాధ్యాయులు ఎ. కృష్ణయ్య, రాజు, కవిత తదితరులు నర్సింలుకు అభినందనలు తెలియజేశారు.

# ప్రధాని మోదీని కలిసిన యోగి ఆదిత్యనాథ్..

-యూపీ 2027 ఎన్నికలపై చర్చ



ఉత్తర ప్రదేశ్‌లో 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీకి ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అందుకే ఈ ఎన్నికలపై చర్చించేందుకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీలోని లోక్ కల్యాణ్ మార్గ్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. అలాగే, కేంద్ర మంత్రి జేపీ నడ్డాతోనూ యోగి చర్చలు జరిపారు. శనివారం వరుసగా ప్రధాని సహా బీజేపీ అగ్రనేతల్ని యోగి కలుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ఎలా సిద్ధమవ్వాలి అనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో బిడా ఝూన్సీ ప్రారంభోత్సవానికి మోదీని ఆహ్వానించినట్లు తెలుస్తోంది. అలాగే, ఇంకా కొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు కూడా చేయబోతున్నారు. యూపీలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి పట్టు నిలుపుకోవాలని, మరోసారి అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఇందుకోసం అవసరమైతే రాష్ట్రానికి చెందిన మాజీ ఎంపీలను, గతంలో బీజేపీ అధ్యక్షులుగా పని చేసిన వారిని, మంత్రులను కూడా పోటీ చేయించాలని బీజేపీ భావిస్తోంది.

# తాంత్రికుడి వద్దకు కుమార్తెను తీసుకెళ్లిన తల్లి..

- ఆ బాలికపై అత్యాచారం



**లక్నో: నవ సంఘర్షణ**

అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తెను తాంత్రికుడి వద్దకు ఒక మహిళ తీసుకెళ్లింది. అయితే ఆ మంత్రగాడు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నరైని ప్రాంతానికి చెందిన ఒక మహిళకు చెందిన 13 ఏళ్ల కుమార్తె అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ నేపథ్యంలో మూఢ నమ్మకంతో క్షుద్రపూజలు చేసే తాంత్రికుడైన 55 ఏళ్ల పరశురామ్ యాదవ్ వద్దకు ఆమెను తీసుకెళ్లింది. అయితే వ్యాధి నయం పేరుతో మంత్రగాడు ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ మహిళ తన కుమార్తెతో కలిసి బిసాండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.కాగా, పోలీసులు వెంటనే స్పందించారు. వైద్య పరీక్షల కోసం ఆ బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిలౌలి గ్రామానికి చెందిన నిందితుడైన తాంత్రికుడు పరశురామ్ యాదవ్‌ను శుక్రవారం సాయంత్రం పావారి గ్రామం సమీపంలో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# నాగాలాండ్‌లో కల్తీ మద్యం తాగి 19 మంది మృతి..

-ముఠా గుట్టు విప్పేందుకు సిట్ ఏర్పాటు



**కోహిమా ,నవ సంఘర్షణ**

నాగాలాండ్ లో కల్తీ మద్యం తాగి మృతిచెందిన వారి సంఖ్య 19కి చేరింది. దీంతో ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కల్తీ మద్యం సరఫరా చేస్తున్న ముఠాను పట్టుకునేందుకు ఆపరేషన్ చేపట్టారు. గత రెండు రోజుల నుంచి రెండు జిల్లాల్లో మృతుల సంఖ్య అధికంగా ఉన్నది. మోకాక్‌చుంగ్‌లో 8 మంది, టున్‌సాంగ్‌లో 11 మంది మృతిచెందారు. కల్తీ మద్యం ముఠాను పట్టుకునేందుకు నాగా పోలీసులు సిట్ ఏర్పాటు చేశారు. నకిలీ మద్యం ఎక్కడ నుంచి సరఫరా అవుతుందో తేల్చేందుకు ఆ సిట్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది.అదనపు ఎస్పీ ఐ బుంగ్‌లాండ్ చాంగ్ , సీనియర్ ఎస్పీ వెసుప్రా కీజో నేతృత్వంలో పనిచేయనున్నది. అనుమానిత లిక్కర్ శ్యాంపిళ్లను ఫోరెన్సిక్ పరీక్ష కోసం గౌహతికి పంపించారు. ఈ కేసులో కొన్ని ఆధారాలు దొరికాయని, కానీ ఆ వివరాలను ఇప్పుడే వెల్లడించలేమని అధికారులు చెప్పారు. మృతుల సంఖ్య పెరగడంతో.. పలు ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. కల్తీ మద్యంతో లింకున్న సుమారు 19 మందిని అరెస్టు చేశారు. మూడు వేల బాటిళ్ల మద్యాన్ని సీజ్ చేశారు. వాస్తవానికి నాగాలాండ్‌లో 1990 నుంచి మద్య నిషేధం అమలులో ఉన్నది.

# యూనివర్సిటీలో దెయ్యం..

**ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినే దెయ్యంగా మారిందంటూ పుకార్లు**



**నవ సంఘర్షణ**

పంజాబ్, పాటియాలా జిల్లాలోని చిట్కారా యూనివర్సిటీలో దెయ్యం ఉందంటూ ప్రచారం మొదలైంది. హాస్టల్ గదిలో దెయ్యం ఉందంటూ పుకార్లు రావడంతో భయపడ్డ విద్యార్థులు రాత్రిపూట ఆందోళన నిర్వహించారు. ఇది కాస్తా.. ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఆందోళనను అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై విద్యార్థులు దాడి చేశారు. పోలీసు వాహనాన్ని ధ్వంసం చేశారు. హాస్టల్ క్యాంపస్‌లోని ఫర్నీచర్ సహా అనేక ఆస్తులు కూడా ధ్వంసమయ్యాయి. ఈ ఘటన చిట్కార్ యూనివర్సిటీ క్యాంపస్‌లో సెప్టెంబర్ 25, రాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని, ఆమె ఆత్మ దెయ్యంగా మారి వేధిస్తోందనే ప్రచారం అక్కడ మొదలైంది. ఇదే సమయంలో ఇందుకు సంబంధించిన దెయ్యం వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. తమకు రక్షణ కల్పించాలని యూనివర్సిటీ అధికారులను వేడుకున్నారు. స్పందించిన యూనివర్సిటీ సిబ్బంది హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అసలు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎప్పుడూ, ఏ విద్యార్థినీ ఆత్మహత్య చేసుకోలేదని, అందువల్ల దెయ్యం ఉండేందుకు అవకాశం లేదని చెప్పారు. కొందరు విద్యార్థులు ఆకతాయి తనంతో బయటి నుంచి హాస్టల్ గదులకు తలుపులు వేయడం వల్ల, అది దెయ్యమే చేసిందని భయపడుతున్నారని వివరించారు. విద్యార్థులకు భద్రత కల్పిస్తామన్నారు. కానీ, దీనికి హాస్టల్ విద్యార్థులు సంతృప్తి చెందలేదు. తమ భద్రత కోసం ఆందోళనకు దిగారు. ఇది మరింత పెరగడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కానీ, విద్యార్థులు శాంతించలేదు. దీంతో శుక్రవారం రాత్రి పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో విద్యార్థులు పోలీసులపైకి, పోలీసు వాహనాలపైకి దాడి చేశారు. పలు వాహనాల్ని ధ్వంసం చేశారు. క్యాంపస్‌లోని ఆస్తుల్ని కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటనలో రాజ్‌పుర సిటీ కేఎస్ఎం ఇంచార్జి అజయ్‌పై విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. మరోవైపు యూనివర్సిటీలో ఒక విద్యార్థిని కనిపించకుండా పోయిందని, ఆమె దెయ్యంగా మారిందనే ప్రచారం జరగగా.. యూనివర్సిటీ అధికారులు అసలు అలాంటి విద్యార్థే లేదని చెప్పారు. అన్ని సీసీటీవీ కెమెరాలు పరిశీలించి, విద్యార్థులు భద్రతకు అండగా ఉంటామని పోలీసులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి ప్రశాంతంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి..

- లోక్‌సభ స్పీకర్‌ను కోరిన జితన్ రామ్ మాంజీ



**న్యూఢిల్లీ నవ సంఘర్షణ**

కేంద్ర మంత్రి, ఎన్డీఏ కూటమి సభ్యుడు జితన్ రామ్ మాంజీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. పార్లమెంట్‌లో కీలక బిల్లులపై చర్చ జరుగుతున్న సమయంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు చెందిన ఎంపీలు మాట్లాడేందుకు.. వారికి మరింత ఎక్కువ సమయాన్ని కేటాయించాలని ఆయన కోరారు. ఢిల్లీలోని తమ నివాసంలో ఎన్డీఏ ఎంపీలతో జరిగిన సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జేపీపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్ ఈ అంశాన్ని లేవనెత్తినట్లు మాంజీ తన లేఖలో తెలిపారు.తమ వర్గానికి చెందిన అంశాలను ప్రస్తావించేందుకు ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు తగినంగా సమయాన్ని కేటాయించాలని పటేల్ కోరినట్లు మంత్రి మాంజీ తన లేఖలో చెప్పారు. ఎంపీ పటేల్ చేసిన అభ్యర్థనను దృష్టిలో పెట్టుకుని, సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని ఆయన స్పీకర్‌ను కోరారు. ఎస్సీ, ఎస్టీలకు సభలో మాట్లాడేందుకే కేటాయించిన సమయాన్ని మరింత పెంచాలని కోరుతున్నట్లు ఎంపీ పటేల్ ఓ మీడియాతో పేర్కొన్నారు. తమకు సమయం ఇవ్వడం లేదన్న అంశం కాదు అని, కానీ ఎక్కువ సమయం కావాలని, ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన సమస్యలను సభలో మరిన్ని చర్చించాలని పటేల్ తెలిపారు.

# పాదచారులు చనిపోతే కాంట్రాక్టర్లే బాధ్యులు..

-నాసిరకం రోడ్లపై ఒడిశా సర్కార్ ముసాయిదా నిబంధనలు!



**భువనేశ్వర్: నవ సంఘర్షణ**

తప్పుడు డిజైన్లు, నాసిరకం నిర్మాణం, సరైన నిర్వహణ లేక రోడ్డు ప్రమాదాల్లో పాదచారులు చనిపోయినా లేదా గాయపడినా అందుకు ఆ రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థలపై నేరాభియోగాలను నమోదు చేసి, జరిమానాలు విధించాలని ఒడిశా ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు పాదచారుల భద్రత నిబంధనల ముసాయిదాను ఈ నెల 24న విడుదల చేసింది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. మోటర్ వాహనాల చట్టంలోని సెక్షన్ 198ఏ ప్రకారం ఈ తరహా ఘటనల్లో కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది.దీంతో పాటు నిర్మాణ సంస్థలను ఒప్పందాల నుంచి తొలగించడం, బ్లాక్ లిస్టులో పెట్టడం, చెల్లింపులను నిలిపేయడం చేస్తారు. రోడ్డు ప్రాజెక్టుకు తుది అనుమతి లేదా తుది ఆర్థిక చెల్లింపు జరిగే ముందు, ప్రధాన ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు వ్యక్తిగత చట్టపరమైన బాధ్యతను అంగీకరిస్తూ భద్రత సమ్మతి ప్రకటనపై తప్పనిసరిగా సంతకం చేయాలి.

## ఖాళీ స్థలం శుభ్రం చేస్తుండగా

# బయటపడిన మహిళ మృతదేహం..

**బెంగళూరు: నవ సంఘర్షణ**

చెత్తతో నిండిన ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని అధికారులు నోటీస్ జారీ చేశారు. దీంతో ఒక స్థలం యజమాని క్లీనింగ్ చేపట్టారు. కొందరు వ్యక్తులు శుభ్రం చేస్తుండగా ఒక మహిళ మృతదేహం బయటపడింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడైన ఆమె భర్తను అరెస్ట్ చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. నగరంలోని ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సంపిగెహళ్లి ప్రాంతంలో 15 ఏళ్ల కిందట స్థలం కొనుగోలు చేసిన యజమాని అందులోని చెత్తను క్లీనింగ్ చేసే పనిని కొంతమంది వ్యక్తులకు అప్పగించాడు.కాగా, సెప్టెంబర్ 2న క్లీనింగ్ సిబ్బంది ఆ స్థలాన్ని శుభ్రం చేస్తుండగా బెడ్‌షీట్‌లో చుట్టి ఉన్న కుళ్లిన మహిళ మృతదేహాన్ని గుర్తించారు. షాకైన ఆ వ్యక్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మహిళ శరీరంలోని కొన్ని భాగాలను కుక్కలు తినేసినట్లు గ్రహించారు. ఆమె దుస్తులపై ఉన్న ట్యాగ్ ఆధారంగా ఒక మాల్‌లో కొనుగోలు చేసినట్లు గ్రహించి అక్కడ ఆరా తీశారు. దీంతో మృతురాలిని



28 ఏళ్ల అనసూయ బెహెరాగా పోలీసులు గుర్తించారు. హోటల్‌లో పని చేసే ఆమె భర్త అయిన బీహార్‌కు చెందిన 32 ఏళ్ల సాగర్ చంద్ర రావత్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఆ మహిళ హత్య మిస్టరీ వీడింది. ఒడిశాకు చెందిన అనసూయ, బీహార్‌కు చెందిన రావత్ కొన్నేళ్ల కిందట పనుల కోసం బెంగళూరు వచ్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడటంతో రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకుని కలిసి జీవిస్తున్నట్లు చెప్పారు. భార్యాభర్తలైన వారిద్దరూ కొన్ని నెలలు కలిసి పలు హోటల్స్‌లో పనిచేసినట్లు వివరించారు. ఆ తర్వాత రావత్ ఒక హోటల్‌లో పనిచేస్తుండగా, అనసూయ ఒక క్లాతింగ్ స్టోర్‌లో ఉద్యోగం చేసిందన్నారు. అయితే భార్యాభర్తలైన అనసూయ, రావత్ ఆర్థిక విషయాలపై తరచుగా గొడవపడేవారని పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 11న ఒక గొడవ తర్వాత రావత్ తన భార్య అనసూయ గొంతునొక్కి హత్య చేశాడు. మూడు రోజుల పాటు ఆమె మృతదేహంతో ఇంట్లోనే ఉన్నాడు. ఆ తర్వాత ఒక దుప్పటిలో చుట్టి సంపిగెహళ్లి ప్రాంతంలోని ఖాళీ స్థలంలో పడేశాడు. కాగా, భార్య మృతదేహాన్ని ఎవరైనా కనుగొన్నారేమోనని తెలుసుకునేందుకు రావత్ చాలా రోజుల పాటు ఆ ప్రాంతానికి వచ్చినట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు. అనసూయ హత్య జరిగిన 20 రోజుల తర్వాత సెప్టెంబర్ 2న ఆ ఖాళీ స్థలాన్ని శుభ్రం చేస్తుండగా కుళ్లిపోయిన ఆమె మృతదేహాన్ని క్లీనింగ్ సిబ్బంది కనుగొన్నట్లు చెప్పారు. భార్య హత్య తర్వాత కూడా రావత్ యధావిధిగా హోటల్‌లో పనికి హాజరయ్యాడని వివరించారు. హోటల్‌లో విచారణ జరిపినప్పుడు ఆ దంపతుల మధ్య తరచుగా గొడవలు జరుగుతునట్లు తెలిసిందన్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# విద్యార్థుల శాంతియుత నిరసన హక్కును కాపాడుతాం..

**పాట్నా,నవ సంఘర్షణ**

విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును న్యాయవ్యవస్థ పరిరక్షిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ హక్కు ఉల్లంఘనకు గురైనప్పుడు న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులపై పోలీసుల అణచివేతకు సంబంధించిన ఫిర్యాదులను కోర్టులు పట్టించుకోకుండా ఉండవని పేర్కొన్నారు.పాట్నాలోని చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ(సీఎన్ఎల్‌యూ)



శనివారం విద్యార్థులతో సీజేఐ సూర్యకాంత్ 'అన్‌ఫిల్టర్డ్ ఇంటరాక్షన్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి.. శాంతియుత విద్యార్థి నిరసనలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ప్రశ్నించారు. పోలీసుల అణచివేతకు సంబంధించిన ఆరోపణలు కోర్టు దృష్టికి వస్తే, వాటిని విస్మరించబోమని సీజేఐ స్పష్టం చేశారు. కొలీజియంలో భిన్నాభిప్రాయాలు నమోదు చేసినప్పటికీ, వాటిని బహిరంగంగా ఎందుకు వెల్లడించరని మరో విద్యార్థి అడిగాడు. దీనికి సీజేఐ స్పందిస్తూ పారదర్శకత అవసరమే అయినప్పటికీ దానికి కొన్ని పరిమితులు ఉంటాయని వివరించారు.

# బిజినెస్

## ట్రాయ్ కొత్త నిబంధనలు..

### ఇకపై డేటా లేకుండానే కాల్స్, ఎస్ఎంఎస్ ప్లాన్లు!



మొబైల్ డేటా అవసరం లేకుండా కేవలం ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్ సేవలను మాత్రమే వినియోగించే వారికి టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. మొబైల్ డేటా వినియోగం తక్కువగా ఉండే వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్లను అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం సంస్థలను ఆదేశించింది. ట్రాయ్ కొత్త నిబంధనల ప్రకారం జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి టెలికాం సంస్థలు ప్రత్యేక వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్లను అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చాలా టెలికాం రీచార్జ్ ప్లాన్లలో డేటాతో పాటు కాల్స్, ఎస్ఎంఎస్ సదుపాయాలను కలిపి అందిస్తున్నారు. అయితే డేటా అవసరం లేని వినియోగదారులు కూడా పూర్తి ప్యాక్‌ల కోసం అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో కేవలం కాల్స్, ఎస్ఎంఎస్ సేవలు మాత్రమే అవసరమైన వినియోగదారులకు ప్రత్యేక ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని ట్రాయ్ సూచించింది. ముఖ్యంగా ఫీచర్ ఫోన్లు వినియోగించే వారు, మొబైల్ డేటా అవసరం లేని వృద్ధులు, అత్యవసర కాల్స్ కోసం మాత్రమే మొబైల్ సేవలను ఉపయోగించే వారికి ఈ నిబంధనలతో ప్రయోజనం కలగనుంది. అలాగే 30 రోజులు లేదా అంతకంటే తక్కువ కాలపరిమితి ఉన్న డేటా ప్లాన్‌కు సమాన కాలవ్యవధితో వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్ కూడా అందుబాటులో ఉండేలా చూడాలని ట్రాయ్ పేర్కొంది. దీంతో వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా రీచార్జ్ ప్లాన్‌ను ఎంచుకునే అవకాశం ఉంటుంది.ట్రాయ్ తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 21 నుంచి అమల్లోకి రానున్నాయి. నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత టెలికాం సంస్థలు తమ రీచార్జ్ ప్లాన్లలో మార్పులు చేసి ప్రత్యేక వాయిస్, ఎస్ఎంఎస్ ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. దీంతో డేటా అవసరం లేని వినియోగదారులకు తమకు అవసరమైన సేవలకు మాత్రమే చెల్లించే అవకాశం లభించనుంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధర

హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శనివారం బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.160 తగ్గి రూ.1,52,680కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.150 తగ్గి రూ.1,39,950 వద్ద నమోదైంది. దీంతో బంగారం ధరలు వరుసగా మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా స్వల్ప హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. మరోవైపు వెండి ధరలో మాత్రం ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. కేజీ వెండి ధర రూ.2,50,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, దేశీయ డిమాండ్ వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతుంటాయి. దీంతో రోజువారీగా ధరల్లో మార్పులు కనిపిస్తుంటాయి.



తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. స్థానిక మార్కెట్ పరిస్థితులు, పన్నులు, వ్యాపారుల మార్జిన్ల ఆధారంగా ధరలు కొంతమేర మారవచ్చు. ఆభరణాలు కొనుగోలు చేసే వారు తాజా మార్కెట్ ధరలతో పాటు తయారీ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

## నిస్సాన్ ‘పిక్సో’ ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రముఖ వాహన తయారీ సంస్థ నిస్సాన్ మరో కొత్త విద్యుత్ కారును ఆవిష్కరించింది. రెనాల్ట్‌తో కలిసి ‘పిక్సో’ పేరుతో రూపొందించిన ఈ చిన్న ఎలక్ట్రిక్ కారు ఆధునిక సాంకేతికత, మెరుగైన ప్రయాణ పరిధితో అందుబాటులోకి రానుంది. పట్టణ ప్రాంతాల్లో రోజువారీ ప్రయాణాలకు అనువుగా ఉండేలా దీనిని రూపొందించినట్లు కంపెనీ వెల్లడించింది. పిక్సో’లో 27.5 కిలోవాట్ అవర్ సామర్థ్యమున్న బ్యాటరీని ఏర్పాటు చేశారు. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే 259 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని నిస్సాన్ తెలిపింది. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ నగరాల్లో రోజువారీ అవసరాలకు సరిపడే ప్రయాణ పరిధిని అందించేలా బ్యాటరీ సామర్థ్యాన్ని రూపొందించారు. దీంతో పట్టణ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ కారును తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ కారులో 50 కిలోవాట్ల డీసీ వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయాన్ని అందించారు. దీని సాయంతో బ్యాటరీని కేవలం 28 నిమిషాల్లో 80 శాతం వరకు ఛార్జ్ చేసుకోవచ్చు. దీంతో ఎక్కువ సమయం ఛార్జింగ్ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సుదూర ప్రయాణాల సమయంలోనూ వేగంగా బ్యాటరీని నింపుకునే అవకాశం ఉంటుంది. సాంకేతికత విషయంలోనూ ‘పిక్సో’లో పలు ఆధునిక సదుపాయాలను అందించారు. కారులో 10 అంగుళాల టచ్‌స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. దీనితో పాటు కృత్రిమ మేధ ఆధారిత గూగుల్ జెమిని సదుపాయాన్ని కూడా అందిస్తున్నారు. వాహనంలోని వివిధ సదుపాయాలను సులభంగా వినియోగించుకోవడంతో పాటు డ్రైవింగ్ సమయంలో సమాచారాన్ని పొందేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడనుంది. ఎలక్ట్రిక్ వాహనాలకు యూరప్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ‘పిక్సో’ను తొలుత అక్కడి మార్కెట్లోకి తీసుకురావాలని నిస్సాన్ నిర్ణయించింది. 2027 ప్రారంభంలో యూరప్‌లో ఈ కారు విక్రయాలు ప్రారంభం కానున్నాయి. చిన్న ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో పెరుగుతున్న పోటీ నేపథ్యంలో నిస్సాన్-రెనాల్ట్ భాగస్వామ్యంతో రూపొందిన ఈ మోడల్ మార్కెట్లోకి రానుంది. బ్యాటరీ సామర్థ్యం, ప్రయాణ పరిధి, వేగవంతమైన ఛార్జింగ్, ఆధునిక సాంకేతిక సదుపాయాలను ఒకే కారులో అందించడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకునేలా ‘పిక్సో’ను రూపొందించినట్లు కంపెనీ వివరించింది. అయితే ఈ కారు ధర, ఇతర మార్కెట్లలో విడుదల చేసే అంశాలపై నిస్సాన్ నుంచి మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.




## నాకు ఇదే చివరి వరల్డ్‌కప్.. ఆ విషయాన్ని అసలు పట్టించుకోను..!

భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో ఆడడంపై ఎవరికీ సందేహాలు లేవు. ఫామ్, ఫిట్‌నెస్ రీత్యా పటిష్టంగా ఉన్న విరాట్ మరోసారి భారత జట్టు విజయాల్లో కీలకం అవుతాడని మాజీ ఆటగాళ్లు, అభిమానులు విశ్వసిస్తున్నారు. కెరీర్లో చివరి ప్రపంచకప్ ఆడబోతున్న మాజీ సారథి కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నాడు. శంలో వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌పై దృష్టి సారించిన కోహ్లీ మెగా టోర్నీకి తాను సదా సిద్ధంగా ఉన్నానని అన్నాడు. తిరువనంతపురంలో తొలి మ్యాచ్‌కు ముందు కోహ్లీ మాట్లాడుతూ తన సన్నద్ధతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ‘దేశం తరుపున నేను ఆడబోతున్న చివరి వరల్డ్‌కప్ ఇదే. ఇంతకంటే ప్రేరణ ఇంకేం కావాలి’ అని వెల్లడించాడీ రన్ మెషీన్.కెరీర్ చరమాంకంలో ఉన్న విరాట్ కోహ్లీ మరో ప్రపంచకప్ లక్ష్యంగా సాగుతున్నాడు. వన్డేల్లో గొప్పగా ఆడుతున్న విరాట్ 2027 వరల్డ్‌కప్‌లో చెలరేగిపోవాలని భావిస్తున్నాడు. మెగా టోర్నీకి సన్నాహకంగా వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడుతున్న కోహ్లీ తనకు ఇదే చివరి వరల్డ్‌కప్ అని పేర్కొన్నాడు.‘నేను భారత జట్టు తరఫున ఆడనున్న చివరి వరల్డ్‌కప్. ఇంతకంటే ప్రేరణ ఇంకేం కావాలి. ఇంకా చెప్పాలంటే వరల్డ్‌కప్ గెలుపొందడమే మా టార్గెట్. అయితే.. మెగా టోర్నీలో ఎంత వరకు వెళ్లినా సరే. అందుకు నేను సిద్ధంగా ఉన్నా’ అని విరాట్ తెలిపాడు. కెరీర్లో చివరి వరల్డ్ కప్ ఆడుతున్నందున ఒత్తిడి, అంచనాలు ఉండడం సహజమేనని అంగీకరించిన కోహ్లీ.. తాను మాత్రం స్వేచ్ఛగా ఆడాలని నిర్ణయించుకున్నట్టు చెప్పాడు.‘ఇప్పుడు ఆట పరంగా ఏం మారిందంటే.. నేను స్వేచ్ఛగా ఆడాలనుకుంటున్నా. నాపై అభిమానులు పెట్టుకున్న అంచనాల గురించి ఇక ఆందోళన చెందను. చాలా ఏళ్లుగా జట్టులో నా పాత్ర ఏంటో నాకు తెలుసు. మిడిలార్డర్‌కు స్థిరత్వం తీసుకురావడాన్ని కొనసాగిస్తాను. ఆటలో వైవిధ్యం చూపేందుకు నేను కృషి చేస్తా. అప్పుడు మనకు 30-40 పరుగులు వస్తాయి. అలాఅని రిస్క్ తీసుకోను. ఇన్నింగ్స్ మధ్యలో అవసరాన్ని బట్టి దూకుడు.. సంయమనం పాటించడం ముఖ్యమని నాకు తెలుసు. ఇటీవల వన్డేల్లో ఆట చాలా మారిపోయింది. చాలా జట్లు 340 నుంచి 350 రన్స్ కొడుతున్నాయి. అలాంటప్పుడు మనం కూడా 350 నుంచి 360 కొట్టాలి. నేను క్రీజులో ఉండి రిస్క్ తీసుకుంటే భారత జట్టు అలవోకగా 360కి పైగా స్కోర్ చేస్తుంది. మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం వల్లనే ఇటీవల స్వేచ్ఛగా ఆడుతున్నా’ అని విరాట్ వెల్లడించాడు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే వేదికగా వరల్డ్‌కప్ జరుగనుంది. అక్టోబర్ 4వ తేదీ నుంచి నవంబర్ 21 వరకు ఈ ఐసీసీ మెగా ఈవెంట్ అభిమానులను ఉర్రూతలూగించనుంది.



## ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు మళ్లీ గాయం..

### కివీస్‌తో సిరీస్‌కు దూరం

న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్లీ గాయపడ్డాడు. కొత్తగా అతని కుడి కాలికి గాయమైంది. దీంతో న్యూజిలాండ్‌తో జరగనున్న సిరీస్‌కు అతను దూరం కానున్నాడు. బెంగుళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటున్న హార్దిక్ పాండ్యా.. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గాయంతో ఇబ్బందిపడ్డాడు. కుడి కాలి మోకాలు కింద భాగంలో అతనికి తీవ్రంగా నొప్పి వచ్చింది. అయితే స్కానింగ్ రిపోర్టుల ఆధారంగా అతను కనీసం మూడు వారాల పాటు రెస్టు తీసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి సెప్టెంబర్ 20వ తేదీనే అతను భారత జట్టుతో కలవాల్సి ఉంది. ఇక అక్టోబర్ 6వ తేదీ నుంచి ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరిగే వన్డే సిరీస్‌కు అతను ఎంపికయ్యాడు. కానీ తాజా స్కానింగ్ రిపోర్టు వల్ల అతను క్రికెట్‌కు దూరం కావాల్సి వస్తోంది. బీసీసీఐ మెడికల్ ప్యానెల్ హెడ్ డాక్టర్ దిన్‌షా పర్దివాలా ఆ రిపోర్టులను పరిశీలించారు.న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్ అక్టోబర్ 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్నది. ఆ తర్వాత వన్డే సిరీస్ జరుగుతుంది. అయితే అప్పటి వరకు హార్దిక్ పాండ్యా కోలుకోవడం అసంభవంగా కనిపిస్తున్నది. వాస్తవానికి ఆసియా గేమ్స్‌లో ఆడేందుకు పాండ్యా జపాన్ వెళ్లాలని బీసీసీఐ భావించింది. వీసా వర్క్ కోసం అతని పాస్‌పోర్టు కూడా తీసుకున్నది. కానీ ఆఫ్ఘనిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు అతను సడెన్‌గా నొప్పితో బాధపడ్డాడు. కొన్ని రోజుల పాటు రెస్టు తీసుకోవాలని అతనే భావించాడు. అయితే ఫిట్‌నెస్ పరీక్షలో అతనికి మళ్లీ నొప్పి రావడంతో కివీస్ సిరీస్ నుంచి తప్పుకోవాల్సి వస్తోంది. ఒకవేళ ఫిట్ అయితే పాండ్యా మళ్లీ జింబాబ్వేతో జరిగే వన్డే సిరీస్‌లో ఆడే అవకాశం ఉంటుంది.



# స్పోర్ట్స్

## అనాహత్ సింగ్ స్టన్నింగ్ షో.. స్క్వాష్ ఫైనల్లోకి భారత క్రీడాకారిణి



**నగోయా**

భారత యువ ప్లేయర్, స్క్వాష్ క్రీడాకారిణి అనాహత్ సింగ్.. తన కెరీర్‌లో అత్యద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఏషియన్ గేమ్స్ లో మహిళల సింగిల్స్ ఈవెంట్‌లో ఆమె ఫైనల్‌కు ప్రవేశించింది. సెమీస్‌లో జపాన్‌కు చెందిన ఆరో నెంబర్ ప్లేయర్ సటోమి వాటానబేపై 3-2 తేడాతో విక్టరీ కొట్టింది. 18 ఏళ్ల భారత ప్లేయర్ అనాహత్ .. అసాధారణ రీతిలో తన గేమ్‌ను ఆడింది. తొలుత రెండు సెట్లను కోల్పోయి 2-0 తేడాతో వెనుకబడ్డ అనాహత్.. ఆ తర్వాత అనూహ్యంగా కోలుకున్నది. ఏకంగా చివరి మూడు సెట్లలో విజయం సాధించి .. ఏషియన్ గేమ్స్‌లో తనకు పతకాన్ని ఖాయం చేసుకున్నది. అనాహత్ 9-11 11-13 12-10 11-6 11-3 స్కోరుతో ప్రత్యర్థిపై గెలిచింది.ఇక భారత జోడి జోష్నా చిన్నప్ప, విలావన్ సెంథిల్ కుమార్.. బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన టాంగ్ మింగ్ హాంగ్, లీ కా యి చేతిలో 2-1 (11-10 2-11 11-10) తేడా స్కోరుతో భారత జోడి ఓటమి పాలైంది.

## బాక్సాఫీస్ వద్ద నాని
# ‘ది ప్యారడైజ్’ ఊచకోత!
### రెండు రోజుల్లోనే రూ. 114 కోట్లు..

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రం ‘ది ప్యారడైజ్’ (ుష్ట్రవ్రాఖుతీుఽుఅంవ) బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే తుఫాన్ వసూళ్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం, కేవలం రెండు రోజుల్లోనే రూ. 114 కోట్లకు పైగా గ్రాస్ (ఔశీతీశ్రీసఽఱఅవ +తీశీం) రాబట్టి సరికొత్త రికార్డు నమోదు చేసింది.‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత నాని -- శ్రీకాంత్ ఓదెల కాంబోలో వచ్చిన రెండో సినిమా కావడం, దానికి తోడు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు తోడవడంతో థియేటర్లలో ప్రేక్షకులకు మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్ లభిస్తోంది. నాని మాస్ పెర్ఫార్మెన్స్‌కు థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. వారం రోజులు ముగిసేసరికే ఈ సినిమా మరిన్ని భారీ మైలురాళ్లను అధిగమిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




## రానా సమర్పణలో కార్తీక్
# సుబ్బరాజు గే లవ్‌స్టోరీ ‘డోరతీ’..
### -అక్టోబర్ 2న తెలుగులో గ్రాండ్ రిలీజ్!



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త బోల్డ్ అండ్ ఎమోషనల్ డ్రామా చిత్రం ‘డోరతీ’ (Dorothy). ఆస్కార్ అవార్డు విజేత గునీత్ మోంగా నిర్మించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్ టైటిల్ రోల్ పోషించగా, సనంత్, రిషికాంత్ కీలక పాత్రల్లో నటించారు. ఇటీవలే తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తాజాగా తెలుగులోకి రాబోతుంది.ప్రముఖ నటుడు రానా దగ్గుబాటికి చెందిన ‘స్పిరిట్ మీడియా’ సంస్థ ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సమాజంలోని పక్షపాతాలు, లింగ సమానత్వం, LGBTQIA+ మరియు జెండర్ రాజకీయాల చుట్టూ తిరిగే విభిన్నమైన, ధైర్యమైన కథాంశాన్ని కార్తీక్ సుబ్బరాజు ఆవిష్కరించారు. టొరంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ప్రశంసలు పొందిన ఈ చిత్రానికి మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించడం విశేషం.



హాట్ ఫోజులతో హీటెక్కిస్తున్న గోల్డెన్ బ్యూటీ..

# ‘లవ్ అండ్ వార్’.. విక్కీ కౌశల్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ రిలీజ్!



బాలీవుడ్ స్టార్ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘లవ్ అండ్ వార్’. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ సినిమా నుంచి తాజాగా విక్కీ కౌశల్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.విడుదలైన పోస్టర్‌లో విక్కీ కౌశల్ చేతిలో సిగరెట్, లైటర్‌తో ఎంతో సీరియస్‌గా, ఇంటెన్స్‌గా చూస్తున్న లుక్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. నజరే మిలేంగీ, లేకిన్ హటేంగీ నహీ (చూపులు కలవొచ్చు.. కానీ పక్కకు తప్పుకోవు) అనే క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. భన్సాలీ చిత్రాల్లో ఉండే ప్రత్యేకమైన గ్రాండియర్, పాత్రల తీవ్రత ఈ లుక్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ఆర్మీ ఆఫీసర్లుగా నటిస్తుండగా, వారిద్దరి మధ్య అలియా భట్ పాత్రతో ముడిపడి ఉన్న ఒక బలమైన ట్రాయంగిల్ కథాంశంతో ఇది తెరకెక్కుతోందని తెలుస్తోంది. సంజయ్ లీలా భన్సాలీ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసుకుంటోంది. రణ్‌బీర్, అలియా మరియు విక్కీ పాత్రల ఫస్ట్ లుక్స్ సినిమాపై ఉన్న క్రేజ్‌ను మరింత పెంచేశాయి. ఈ మోస్ట్ అవైటెడ్ విజువల్ వండర్ 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# ప్రపంచంతో పోరాడుతా!

వివాహం తర్వాత మానసికంగా దృఢంగా మారారు రష్మిక మందన్నా. ఆమె ఎక్కడ మాట్లాడినా ఆ మాటల్లో ఓ పరిపూర్ణత్వం గోచరిస్తున్నది. తాజాగా ఇంటి ఇల్లాలుగా తన బాధ్యతల గురించి అద్భుతంగా మాట్లాడారామె. ‘నా కుటుంబం అభ్యున్నతే నాకు ముఖ్యం. ఇప్పుడు ఇల్లాలిని మాత్రమే. త్వరలో తల్లిని కూడా అవుతా.అప్పుడు నా పిల్లల భద్రత కోసం, వారి సంతోషం కోసం అవసరమైతే ప్రపంచంతో పోరాడతా. నా కుటుంబానికి అందాల్సిన ప్రశాంతత, భద్రత విషయంలో రాజీపడను. మానవ సంబంధాలు, భావోద్వేగ అనుబంధాలకే నా ప్రథమ ప్రాధాన్యత’ అని రష్మిక పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

### కేసీఆర్ పాత్ర చేయాలి అంటే నాకు చాలా భయమేసింది : ప్రియదర్శి



దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో తెరకెక్కిన నాని హీరోగా నటించిన మూవీ ది ప్యారడైజ్ . మోహన్ బాబు విలన్‌గా నటించగా.. కయాదు లోహర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషించింది. ది ప్యారడైజ్‌ను తెలుగు రాష్ట్రాల్లో ఉన్న నాని అభిమానులు ఫుల్ ఎంజాయ్ చేస్తుండగా.. ప్రత్యేకించి ఈ సినిమాలో వచ్చే కేసీఆర్ పాత్ర శంకరన్నకు తెలంగాణ ప్రజలు బాగా కనెక్ట్ అవుతున్నారు.సక్సెస్ ఈవెంట్‌లో ప్రియదర్శి తాను పోషించిన శంకరన్న పాత్ర గురించి ఆసక్తికర విషయాలు చెప్పాడు. ఒక నటుడిగా నన్ను నేను ఆవిష్కరించుకోవాలని నాకు పొట్టు పొట్టు ఆకలి ఉంది. అప్పడొక షేర్ ఫోన్ చేసిండు. ఫోన్ చేసి శంకరన్న పిలుస్తుండు రా అంటే.. మా దొర మా షేర్ శ్రీకాంత్ ఫోన్ చేసి కేసీఆర్ పాత్ర చేయాలి అంటే నాకు చాలా భయమేసింది.. కానీ భయమేసినప్పుడే కదా చాలెంజ్ విలువ ఏంటో తెలిసేది. అప్పుడే కాదనకుండా శంకరన్న పాత్ర తీసుకోవడం జరిగింది. శంకరన్న వేసుకునే బట్టలు ఎక్కడ దొరుకుతాయో వెతికి మరీ పోయి అబిడ్స్‌లో కొన్నడు. ఆ బట్టలు ఎట్లుండాలే.. ఏం చేయాలే.. చెప్పులు ఎట్లా వేసుకుంటడు. ఆ వాచ్ ఎట్లా పెట్టుకోవాలి. తర్వాత మా మేకప్ టీం.. ప్రోస్తటిక్ టీం చాలా మంది శంకరన్నను తయారు చేసిండు. అది ఒక్క రోజులో వచ్చింది కాదు.. దాని వెనుకాల చాలా రీసెర్చ్ ఉండేది. చాలా పనితనం ఉండే.. చాలా నైపుణ్యం ఉండేనని చెప్పుకొచ్చాడు ప్రియదర్శి.



# ఆ మాట విని షాకయ్యా!

కెరీర్ తొలినాళ్లలో ఎదురైన చేదు అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు బాలీవుడ్ భామ తాప్సీ పన్ను. హీరోయిన్‌గా ఎన్నుకొని, అర్థంలేని కారణాలతో తనను తొలగించిన సందర్భాలు చాలా ఉన్నాయని తాప్సీ గుర్తు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ‘కెరీర్ తొలినాళ్లలో ఓ సినిమాకు సైన్ చేశాను. మరుసటి రోజే షూటింగ్. ఉన్నట్టుండి ‘మిమ్మల్ని హీరోయిన్‌గా తప్పించాల్సి వచ్చింది’ అంటూ ఫోన్. కారణం అడిగితే. ‘హీరో భార్యకు నువ్వు నచ్చలేదు..’ అని చెప్పారు.ఆ మాట విని షాకయ్యాను. ఇంకోసారి హీరోగారికి నేను నచ్చలేదంట. అందుకని తప్పించారు. బహుశా ఆయనకు వేరే హీరోయిన్‌తో కలిసి నటించాలని ఉండటం వల్ల అలా జరిగి ఉండవచ్చు. మరోసారైతే.. నన్ను సినిమా నుంచి తప్పిస్తున్న విషయం నాకంటే మీడియాకే ముందు తెలిసింది. ఆ తర్వాత చిత్రబృందం నుంచి నాకు ఫోన్ వచ్చింది. కారణం మాత్రం ఇప్పటికీ తెలియదు. ఇలా తొలినాళ్లలో చాలా ఎదురుదెబ్బలు రుచిచూశా’ అని చెప్పారు తాప్సీ.